విశాఖపట్టణం
శనివారం18 జులై 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:175 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## అంగన్వాడీలకు తల్లికి వందనం

ఆయాలకు, టీచర్లకు కూడా వర్తింపు

రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త

వేలది మందికి ఊరట



2

# రైతులందరికీ రుణాలు

5లక్షల మందితో ఎంఎస్ఎంఈలు

వైసీపీ పాలనలో విధ్వంసం.. చీకట్లు

కేంద్రం సహకారంతో బయటపడ్డాం

సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు

పల్నాడులో బారీ రుణమేళా

హాజరైన కేంద్ర ఆర్థిక మంత్రి

నిర్మలా సీతారామన్





(పల్నాడు - జయజయహే)

బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదు, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రైతు భవిష్యత్తు మార్చడానికి, యువకుడి ఆశయానికి, మహిళా సాధికారతకు ఈ రుణాలు ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే క్రెడిట్ అవుట్‌రీచ్ ద్వారా మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో నేడు జరిగిన భారీ రుణ మేళా కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. స్థానిక కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో జరిగే సభలో పాల్గొని రూ. 3,216 కోట్ల రుణాలను రైతులు, మహిళలు, నిరుద్యోగ యువతకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ "పల్నాడు పౌరుషానికి శక్తిమంతమైన ఆయుధమిస్తున్నాం. పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి. ఏ అభివృద్ధి కార్యక్రమం తెచ్చినా ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి. క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు. రైతులు, విద్యార్థులు ఇలా అర్హులైన అందరికీ రుణం అందించడమే లక్ష్యం. ప్రజల వద్దకే బ్యాంకులు వెళ్లి రుణాలు అందించడం గర్వకారణం. ఈ ఏడాది 5 లక్షల మందితో ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేసేలా చర్యలు. బ్యాంకింగ్‌లో నిర్మలా సీతారామన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారు. నష్టాల్లో ఉన్న ..మిగతా 5లో



## పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు

జెండా ఊపి ప్రారంభించిన మోదీ

రూ. 5 నుంచి రూ. 25 మధ్యే చార్జీలు

2,600 మంది ప్రయాణించే ఛాన్స్

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశంలో తొలి హైడ్రోజన్ రైలు ప్రారంభమైంది. ప్రధాని మోదీ తన చేతుల మీదుగా పచ్చజెండా ఊపి ట్రైన్ ప్రారంభించారు. జూలై 17న ఉదయం 11 గంటల సమయంలో హర్యానాలోని జింద్–సోనిపత్ మార్గంలో భారతదేశపు మొట్టమొదటి హైడ్రోజన్ ఆధారిత రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఎలాంటి కార్బన్ ఉద్గారాలను విడుదల చేయని ఈ ట్రైన్‌తో పర్యావరణానికి ఎంతో మేలు చేకూరనుంది. కేవలం రూ. 5 నుండి ఈ రైలులో ఛార్జీలు ప్రారంభమవుతాయి. ఛార్జీలు కేవలం రూ. 5 నుండి ప్రారంభమై రూ. 25 వరకు ఉంటాయి. ఈ హైడ్రోజన్ రైలు ప్రయాణికులకు తక్కువ ఖర్చుతో కూడిన ప్రయాణ అవకాశాన్ని అందించనుంది. దీని ప్రారంభ ఛార్జీ, అనేక రైల్వే స్టేషన్లలోని ..మిగతా 3లో

# పార్లమెంట్‌కు కీలక బిల్లులు



రాజ్యాంగ సవరణ బిల్లులపై ఉత్కంఠ

జులై 20 నుంచి 13 వరకు సభలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశ అత్యున్నత చట్టసభ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. ఈ మేరకు లోక్‌సభ సచివాలయం అజెండాను ఖరారు చేసింది. సమావేశాల్లో భాగంగా కేంద్రప్రభుత్వం పలు కీలక చట్టాలను చేయనుంది. జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు, 2026.. వందేమాతరం ,జనగణమన పడుతున్నప్పుడు ఉద్దేశపూర్వకంగా అవమానించడం లేదా అంతరాయం కలిగించడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించేలా ఈ బిల్లును రూపొందించారు. విదేశీ విరాళాల ..మిగతా 2లో

పొత్తులు వర్తించవు..

## బలమేంటో చూపుతాం

ఓట్లు చీలకూడదని అప్పుడు వెనక్కి తగ్గాం

మిత్రపక్షాల సమన్వయంతో జనసైనికులకు న్యాయం

జనసేన మంత్రి నాదెండ్ల మనోహర్ సంచలన వ్యాఖ్యలు



(గుంటూరు - జయజయహే)

రాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, కూటమి పొత్తులపై కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీకి బలం ఉన్న ప్రతి చోటా తాము తప్పకుండా పోటీ చేస్తామని రాష్ట్ర మంత్రి, జనసేన పార్టీ నేత నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో రాబోయే ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. గుంటూరులో ..మిగతా 5లో

## మళ్లీ కరోనా కలకలం..!

రాష్ట్రంలో 13 పాజిటివ్ కేసులు

పుణే ల్యాబ్ కు కొన్ని శాంపిల్స్

పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం - మంత్రి సత్యకుమార్



2

## వచ్చేస్తోంది.. ప్లాస్టిక్ కరెన్సీ

తొలుత రూ. 10, రూ. 20 నోట్లు మొదలు

ఇప్పుడున్న ఈ నోట్లు ఆపేసాక చెలామణీలోకి

ఆర్బీఐలోని బీఆర్బీఎన్ఎంఎల్ కీలక ప్రకటన



2

## తల్లికి వందనంలో కోతలా

లబ్ధిదారుల సంఖ్యలో మాయాజాలం

ఎస్సీ, బీసీ విద్యార్థులకు అన్యాయం.. లోకేశ్‌తో విద్యావ్యవస్థ భ్రష్టు

ఉత్తరాంధ్రలో భూ దోపిడీ.. రాజధానిపై మాయమాటలతో గారడీ

ఎస్ఐఆర్ నమోదులో టీడీపీ అక్రమాలు.. కూటమి పాలనపై బొత్స మండిపాటు



(విశాఖపట్నం - జయజయహే)

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ప్రజలను మాయమాటలతో మోసం చేస్తోందని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విశాఖపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... వైఎస్. జగన్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన 'అమ్మఒడి' పథకానికి పేరు మార్చి 'తల్లికి వందనం'గా కొనసాగిస్తున్న కూటమి ప్రభుత్వం, దాని అమలులో తీవ్ర విఫలమైందని మండిపడ్డారు. బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు విధిస్తూ, అర్హులైన ఎస్సీ, బీసీ విద్యార్థులకు అరకొరగా నిధులు విడుదల చేస్తూ మోసగిస్తున్నారని ఆరోపించారు. లబ్ధిదారుల సంఖ్యపై ఉద్దేశపూర్వక మాయాజాలానికి..మిగతా 2లో

## రివర్ ఫ్రంట్ టూరిజం

ఎమ్యూజ్ మెంట్, ఎకో పార్కులు

అమరావతిలో భారీగా పీపీపీ ప్రాజెక్టులు

అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష



2

## ఓటు లేకుంటే పౌరసత్వం లేనట్లు కాదు

పౌరసత్వాన్ని నిర్ధారించే హక్కు ఈసీకి లేదు

ఈసీ జాబితా తయారీకే మాత్రమే పరిమితం

బీహార్ ఎస్ ఐ ఆర్ తీర్పులో స్పష్టం చేసాం

ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు



2

# వచ్చేస్తోంది.. ప్లాస్టిక్ కరెన్సీ

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



భారత్ ఆర్థిక వ్యవస్థలో మరో కీలక యుగం ప్రారంభంకానుంది. నోట్ల రద్దు వరకు ఆన్‌లైన్ పేమెంట్ గురించి పెద్దగా తెలియదు. కానీ ఇప్పుడు జేబులో డబ్బులు పెట్టుకొని తిరిగే వారి సంఖ్య భారీగా తగ్గిపోయింది. బ్యాంకు ఖాతాలో డబ్బులు ఉంటే చాలా చేతిలో మొబైల్ అందులో డిజిటల్ పేమెంట్ యాప్ ఉంటే దేశమంతా చుట్టి రావచ్చు. అయితే డిజిటల్ చెల్లింపులు ఎంత పెరుగుతున్నప్పటికీ ఫిజికల్ కరెన్సీ ప్రాధాన్యత కూడా ఏమాత్రం తగ్గడం లేదు. అందుకే ఏటా కోట్ల రూపాయల నోట్లు వివిధ కారణాలతో రద్దు చేయాల్సి వస్తోంది. అందుకే కరెన్సీలో మార్పులకు ఆర్బీఐ శ్రీకారం చుట్టింది. పది రూపాయలు, ఇరవై రూపాయలు ఇప్పుడున్న నోట్లను పూర్తిగా ప్రింటింగ్ ఆపేసి సరికొత్తగా ప్లాస్టిక్ కరెన్సీని చెలామణిలోకి తీసుకురానున్నట్టు చెబుతోంది. ఆర్బీఐ తరపున నోట్లు ముద్రించే విభాగంలో బీఆర్‌బీఎన్‌పీఎల్ కీలక ప్రకటన చేసింది. ప్లాస్టిక్ కరెన్సీకి కావాల్సిన ముడిసరకు సరఫరా కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. ముడిసరకు సరఫరా చేసేందుకు చేసేందుకు టెండర్లను పిలిచి అధికారికం ప్రక్రియ ప్రారంభించింది. ఈ విభాగంలో ఆసక్తి ఉన్న కంపెనీలు ఈ టెండర్ ప్రక్రియలో పాల్గొవచ్చు. పాలిమర్ నోట్లనే ప్లాస్టిక్ నోట్లు అంటారు. వీటిని పాలిమర్ షీట్లపై ముద్రిస్తారు. ఇది ఫిల్మ్‌లా ఉంటుంది. ఇది చాలా గట్టిగా దృఢంగా ఉంటుంది. దీనిపై పూత పూసి నోట్లకు సంబంధించిన వివరాలు ముద్రిస్తారు. దీన్ని డూప్లికేట్ చేయడానికి లేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు. దీనికి ఒక వైపు చిన్న పలక మాదిరిగా పెడతారు. అందులో నోట్‌కు సంబంధించిన వివరాలు పొందుపరుస్తారు. దీని వల్ల ఇది ఫేక్ కాదని గుర్తించవచ్చు. అలాంటి వివరాలు లేకుంటే అది ఫేక్ అని నిర్ధారణకు రావచ్చు. ముందు పాలిమర్ నోట్లను పది, ఇరవై రూపాయల కెరన్సీతో ప్రారంభిస్తారు. ఇవి చాలా ఎక్కువ జనాలు వాడతారు. నార్మల్‌గా వీటి తయారీ ఖర్చు కూడా ఎక్కువగా ఉంటుంది. త్వరగా పాడైపోతాయి. అందుకే ముందుగా వాటినే ప్రయోగాత్మకంగా చలామణిలోకి తీసుకొస్తారు. ఇలా చేయడం వల్ల ప్లాస్టిక్ నోట్ల పని తీరుపై ఒక సరైన అవగాహన వస్తుంది. ఇది విజయవంతం అయితే మిగతా నోట్లను కూడా ఈ విధానంలో ముద్రిస్తారు. త్వరలోనే పాలిమర్ నోట్లను తీసుకురాబోతున్నట్టు గత నెలలో జరిగిన ద్రవ్యవిధాన ప్రకటనలో ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఆయన చెప్పిన నెల రోజుల తర్వాత పాలిమర్ షీట్ల కోసం ఆర్బీఐ టెండర్లను పిలిచింది. దీని ప్రకారం ప్రపంచవ్యాప్తంగా పాలిమర్ సప్లై చేసే కంపెనీలు ఈ టెండర్‌లలో పాల్గొనవచ్చు. అయితే ప్రక్రియ ఇప్పుడు అధికారికంగా ప్రారంభమైనప్పటికీ జనాల చేతికి ప్లాస్టిక్ కరెన్సీ వచ్చే సరికి చాలా సమయం పట్టవచ్చు.

**ఆర్బీఐ పాటించే ప్రక్రియ ఏంటీ?**

ఇప్పుడు ఆసక్తి ఉన్న కంపెనీల నుంచి ముడిసరకు కోసం ఆసక్తిని తెలపాలని మాత్రం చెప్పారు. తర్వాత టెండర్ల ప్రక్రియ ఉంటుంది. అనంతరం టెక్నికల్ పరిశీలన ఉంటుంది. మోడల్‌ను పరీక్షిస్తారు. దాన్ని భద్రతను పరిశీలిస్తారు. పైలట్ ప్రాజెక్టు కింద పది రూపాయలు, ఇరవై రూపాయల నోట్లతో చెలామణిలోకి తీసుకొస్తారు. ఇప్పుడు ఉన్న కరెన్సీతోపాటు ప్లాస్టిక్ కరెన్సీ కూడా అందుబాటులోకి తెస్తారు. కొంతకాలం పరిశీలించి అప్పుడు ఒక నిర్ణయం తీసుకుంటారు. భారత్‌లో ప్లాస్టిక్ నోట్ చెలామణిలోకి తీసుకురావాలనే ఆలోచన 2009లో మొదలైంది. 2012లో పది రూపాయ నోట్లతోనే దీన్ని ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇలా ముద్రించిన నోట్లను వివిధ పరిస్థితుల్లో ప్రయోగించాలని 2014లో భావించారు. తర్వాత వివిధ కారణాలతో ప్రాజెక్టును ఆపేశారు. మళ్లీ 2026లో ప్రక్రియను మొదలు పెట్టారు. ఓవైపు డిజిటల్ చెల్లింపులు భారీగానే జరుగుతున్నాయి. అదే సమయంలో కరెన్సీ ప్రాధాన్యత తగ్గేదేలే అన్నట్టు ఉంది. 2026లో 42.86 కోట్ల రూపాయల నగదు దేశంలో చెలామణి అవుతోంది. అందుకే ఇందులో కోట్ల రూపాయల విలువైన కరెన్సీ వివిధ కారణాలతో నాశనమవుతోంది. వీటిని మళ్లీ ముద్రించేందుకు కోట్ల రూపాయలు ఆర్బీఐ ఖర్చు చేయాల్సి వస్తోంది.

**ప్లాస్టిక్ కరెన్సీ ప్రయోజనాలు ?**

ఎక్కువ కాలం మన్నిక అయ్యే ప్లాస్టిక్ కరెన్సీ తీసుకు వస్తే ఆర్బీఐపై భారం తగ్గుతుందని ఆలోచన ఉంది. ఇప్పుడు ఉన్న కరెన్సీ కంటే నాలుగైదు సంవత్సరాలు ఎక్కువ కాలం చెలామణిలో ఉంటాయి. నీటిలో త్వరగా పాడయ్యే పరిస్థితి ఉండదు. నోటు త్వరగా నాశనం కాదు. ఇందులో భద్రతా ఫీచర్స్ కారణంగా ఫేక్ చేయడానికి కూడా వీలు ఉండదు. ఈ విషయంలో ఆర్బీఐ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్లాస్టిక్ కరెన్సీతో వచ్చే సమస్యలేంటి? పాలిమర్ కరెన్సీ నోట్ల విషయంలో కూడా చాలా అనుమానాలు ఉన్నాయి. భారత్ వంటి ఉష్ణ ప్రాంతంలో ప్లాస్టిక్ కరెన్సీ మనుగడ అంత ఈజీ కాదు. ఇప్పుడు దీనికి కావాల్సిన ముడి పదార్థాన్ని విదేశాల నుంచి తెప్పించుకోవాలి. ఇది ఖరీదుతో కూడుకున్న వ్యవహారం. వాటిని భరించి పాలిమర్స్ కరెన్సీ తీసుకొచ్చినా... ఇప్పుడు ఉన్న ఏటీఎంలు, నోట్ల లెక్కింపు యంత్రాలు అన్నింటినీ మార్చాల్సి ఉంటుంది. ఇది బ్యాంకులకు భారం కానుంది. పాలిమర్స్ నోట్లు మడిచినప్పుడు ముడతలు పడుతున్నాయే ఫిర్యాదు చాలా దేశాల్లో ఉంది. దీన్ని కూడా అధిగమించాల్సి ఉంటుంది. అయితే ప్రారంభ ఖర్చు ఎక్కువగా ఉన్నప్పటికీ కాలక్రమేణా ఆ ఖర్చు తగ్గుతుందని చెబుతున్నారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో పాలిమర్ కరెన్సీ చెలామణిలో ఉంది. దీన్ని మొదట తీసుకొచ్చింది మాత్రం ఆస్ట్రేలియా. ఇక్కడ 1988లోనే తొలిసారిగా అమల్లోకి వచ్చింది. తర్వాత అక్కడ వాటి ప్రయోజనాలను గుర్తించిన బ్రిటన్, కెనడా, సింగపూర్, న్యూజిలాండ్, వియత్నాం, మలేషియా, బ్రూనై వంటి 40 దేశాల్లో ఈ ప్లాస్టిక్ కరెన్సీ వాడుకలో ఉంది.

## అంగన్వాడీలకు తల్లికి వందనం

(అమరావతి - జయజయహే)

రాష్ట్రంలోని అంగన్వాడీ టీచర్లు, మినీ అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తల్లికి వందనం పథకాన్ని వీరికీ వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంపై మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హర్షం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగన్వాడీ సిబ్బంది అందరికీ వర్తించనుంది. చాలా కాలంగా వారు కోరుతున్న డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పలుమార్లు తమ విజ్ఞప్తులను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై సమగ్రంగా పరిశీలించిన ప్రభుత్వం చివరకు వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది అంగన్వాడీ సిబ్బందికి ఈ నిర్ణయం ఊరటనివ్వనుంది. ఈ నిర్ణయంపై మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హర్షం వ్యక్తం చేశారు. అంగన్వాడీల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్న సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు రాష్ట్ర అంగన్వాడీ కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం అంగన్వాడీ సిబ్బందిలో మరింత ఉత్సాహం, భరోసా నింపుతుందని చెప్పారు. ప్రభుత్వం తమ సేవలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకోవడం అంగన్వాడీ సిబ్బందికి గొప్ప గుర్తింపని మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్న అంగన్వాడీ సిబ్బందికి ప్రభుత్వం అండగా ఉంటుందనే సందేశాన్ని ఈ నిర్ణయం ఇస్తోందని ఆమె తెలిపారు.

## మళ్లీ కరోనా కలకలం..!

(అమరావతి - జయజయహే)

కరోనా మహమ్మారి మళ్లీ కలకలం రేపుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కొత్తగా కోవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదవడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. తక్షణమే అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. జూన్ 26 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో మొత్తం 13 కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. కడప జిల్లా 8, గుంటూరులో 3, విశాఖ, కాకినాడ జిల్లాల్లో ఒక్కో కేసు గుర్తించారు. వేర్వేరు ప్రాంతాల్లో కేసులు నమోదైనా, ఒకేచోట గుంపుగా బయటపడలేదని వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. కరోనా వచ్చిన వారంతా హోం ఐసోలేషన్ లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ కేసుల్లో నలుగురు మరణించినట్లు ఆరోగ్య శాఖ వర్గాలు ధ్రువీకరించాయి. వారంతా కరోనాతోపాటు.. పలు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో చనిపోయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన బాధితుల్లో ముగ్గురు ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లో ఉండగా, ఇతరులు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఇటు మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌లో కొవిడ్ కలకలం రేగింది. నిన్న కరోనా లక్షణాలతో వచ్చిన ఒక వ్యక్తికి వైద్యులు చికిత్స అందించి హోం ఐసోలేషన్‌కు పంపించారు. ఎయిమ్స్‌లో ప్రత్యేక ఫీవర్ వార్డును ఏర్పాటు చేశారు. మరోవైపు జ్వరం కేసుల దృష్ట్యా జిజిహెచ్ వైద్యులు కూడా అప్రమత్తమయ్యారు. ఆసుపత్రి వర్గాలు ఇప్పటికే 250 ఆర్టీపీసీఆర్ కిట్లను సిద్ధం చేసి... అనుమానితులకు కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**పుణే ల్యాబ్ కు ఐదు శాంపిల్స్..**

కరోనా కేసుల నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. వైరస్ జన్యుక్రమ విశ్లేషణ కోసం 5 నమూనాలను పుణెలోని జాతీయ వైరాలజీ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం పంపింది. కరోనా లక్షణాలు కనిపించిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించింది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, టెస్టింగ్ కిట్లు, ఆక్సిజన్ నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టమైన సూచనలు ఇచ్చింది. ప్రస్తుతానికి కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు.

**పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం - మంత్రి సత్యకుమార్**

రాష్ట్రంలోనూ, దేశవ్యాప్తంగా కొవిడ్ కేసులు నమోదవుతున్నాయని జనం ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. దేశవ్యాప్తంగా 339 కొవిడ్ కేసులు నమోదయ్యాయని కేరళలో 115, కర్ణాటకలో 64, తమిళనాడులో 39 కేసులు బయటపడ్డాయని తెలిపారు. రాష్ట్రంలో మాత్రం 13 కోవిడ్ కేసులు నమోదయ్యాయని మంత్రి చెప్పారు. 20 రోజులుగా పరిశీలన చేస్తున్నామని కొవిడ్‌పై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని జనం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి చెప్పారు. పుణె ల్యాబ్‌కు నమూనాలు: కొవిడ్‌తో పాటు హెమటాలజీ, హై బీపీ కారణంగా మరణాలు సంభవించాయని జీనోం సీక్వెన్సింగ్ కోసం పుణె ల్యాబ్‌కు నమూనాలు పంపించామని మంత్రి తెలిపారు. శానిటైజర్లు, కొవిడ్ సామగ్రి అందుబాటులో ఉంచామని ఆస్పత్రిలో ఐసోలేషన్ వార్డులు పెట్టామని చెప్పారు. కోవిడ్ ప్రమాదకరమైన వేరియంట్ కాదని జీనోం సీక్వెన్సింగ్ తర్వాతే కోవిడ్ వేరియంట్ తెలుస్తుందని మంత్రి చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా రాయనపాడు రైల్వే స్టేషన్ పునర్ అభివృద్ధి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మీడియాతో మాట్లాడారు.ల

## రివర్ ఫ్రంట్ టూరిజం

(అమరావతి - జయజయహే)

రాజధాని నగరం అమరావతిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా అమరావతి రివర్ ఫ్రంట్ టూరిజం ప్రాజెక్టులపై మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ ఏడీసీఎల్ అధికారులతో కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజధాని ప్రాంతంలో పర్యాటక రంగాన్ని పరుగులు పెట్టించేందుకు, భవిష్యత్తు ప్రణాళికలపై అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో భారీ ప్రాజెక్టులను చేపట్టనున్నారు. రాజధానిలో ప్రధాన రహదారులు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు పూర్తి కావడానికి సమాంతరంగానే.. ఈ టూరిజం ప్రాజెక్టులను కూడా అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని, దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించే విధంగా పనులను వేగవంతం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. అమరావతిలో పర్యాటక రంగ అభివృద్ధి కోసం గతంలోనే భూములు పొందిన పలు ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలు.. తమ ప్రాజెక్టు పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు మంత్రి నారాయణ. ఈ విషయంలో జాప్యాన్ని సహించేది లేదని, అధికారులు ఆయా సంస్థలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. సచివాలయంలో జరిగిన ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథితో పాటు టూరిజం, నగర ప్రణాళిక విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే కృష్ణా నది తీరాన అమరావతి సరికొత్త పర్యాటక వైభవానికి కేంద్రబిందువుగా మారనుంది.

## ఓటు లేకుంటే పౌరసత్వం లేనట్లు కాదు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఓటరు జాబితాలో పేరు లేకపోవడం వల్ల ఎవరూ పౌరసత్వాన్ని కోల్పోరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్‌లో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియకు సంబంధించి దాఖలైన పిటిషన్‌ను విచారించిన సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. పౌరసత్వాన్ని నిర్ధారించే అంతిమ అధికారం భారత ఎన్నికల సంఘానికి లేదని తేల్చి చెప్పింది. ఓటర్ల జాబితా నుండి తొలగించినంత మాత్రాన పౌరసత్వాన్ని కోల్పోరని బీహార్ ఎస్ ఐ ఆర్ తీర్పులోనే తాము స్పష్టం చేశామని కోర్టు పేర్కొంది. ఎస్ ఐ ఆర్ నుండి మినహాయించిన వ్యక్తుల అప్పీళ్లను విచారించడానికి ఏర్పాటు చేసిన అప్పీలేట్ ట్రిబ్యునళ్లలో విచారణ ప్రక్రియను క్రమబద్ధీకరించాలని కోరుతూ ప్రసేన్‌జిత్ బోస్ దాఖలు చేసిన పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఒక వ్యక్తి భారత పౌరుడా? కాదా? అని నిర్ధారించే తుది అధికారం ఈసీకి లేదని, ఓటరు జాబితాలో పేరు లేకపోవడం అనేది కేవలం ఆ వ్యక్తికి ఓటు హక్కు లేదని మాత్రమే సూచిస్తుంది. అంతేతప్ప, అది పౌరసత్వాన్ని రద్దు చేసే పత్రం కాదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఓటరు జాబితా నుంచి పేర్ల తొలగింపు వల్ల పౌరసత్వం పోతుందని, దీనివల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని కొందరు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో, ఈ వివరణ ప్రాధాన్యత సంతరించుకుంది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, తప్పుగా పేర్ల తొలగింపునకు గురైన వారి కోసం సరైన అప్పీల్ వ్యవస్థ ఉండాలని కోర్టు సూచించింది. ఎన్నికల ప్రక్రియ కోసం ఈసీ చేసే వెరిఫికేషన్ కేవలం జాబితా తయారీకి మాత్రమే పరిమితమని స్పష్టం చేసింది.

**ఓటు లేని వారికి సంక్షేమ పథకాలు కట్!**

బెంగాల్ లో ఓటర్ల జాబితాలో ఓటు హక్కు కోల్పోయిన వారు 19 అప్పీలేట్ ట్రిబ్యునళ్ల ముందు 34 లక్షల అప్పీళ్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి.. ఇప్పటివరకు చాలా తక్కువ అప్పీళ్లు సుమారు 38,000 మాత్రమే పరిష్కరించారు. వాటిలో కనీసం 70 శాతం అప్పీళ్లు అనుమతించారు. అప్పీళ్లు పెండింగ్‌లో ఉండగానే, ఓటర్ల జాబితా నుండి తొలగించిన వారికి ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కింద ప్రయోజనాలను, అన్నపూర్ణ యోజన వంటి సంక్షేమ పథకాలను నిరాకరిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసింది. ఆ వ్యక్తులకు కుల ధృవీకరణ పత్రాలను కూడా నిరాకరిస్తున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది సుప్రీంకోర్టుకి తెలిపారు. ఈ సందర్భంగా ఒక వ్యక్తిని ఓటర్ల జాబితా నుండి తొలగించిన తర్వాత, వారి పౌరసత్వ స్థితిని నిర్ధారించడానికి కేంద్రానికి దరఖాస్తు చేసుకోవడం ఈసీఐ విధి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.. పశ్చిమ బెంగాల్ ఎస్ఐఆర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లతో పాటు ప్రభుత్వ పథకాలను నిలిపివేస్తున్నారన్న పిటిషన్ ను విచారణ జరపాలని సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్ణయించింది.

## తల్లికి వందనంలో కోతలా

మొదటి పేజీ తరువాయి...

తెరలేపారని విమర్శించిన ఆయన, అర్హులైన ప్రతి విద్యార్థికి ఈ పథకాన్ని ఎటువంటి కోతలు లేకుండా ఒకే విడతలో వర్తింపజేయాలని, దీనిపై సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అమ్మఒడి పథకం ఈ ప్రభుత్వం కొత్తగా తెచ్చింది కాదు, మా ప్రభుత్వం తెచ్చిన పథకానికి పేరు మార్చి కంటిన్యూ చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు పేర్లు మార్చుకోవడం సహజమే కానీ, దీన్ని సక్రమంగా అమలు చేయడం లేదు. తొలి ఏడాది ఉద్దేశపూర్వకంగానే పిల్లలకు పథకం ఎగ్గొట్టారు. రెండో ఏడాది కూడా పూర్తిస్థాయిలో ఇవ్వలేదు. ఎన్నికల ప్రచారంలో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి, నీకు రూ.15వేలు, నీకు రూ.15 వేలు ఇస్తామని ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక రూ.2,000 తగ్గించి రూ.13,000 మాత్రమే ఇస్తున్నారు. గతంలో మా ప్రభుత్వ హయాంలో స్కూళ్ల నిర్వహణ కోసం రూ.2,000 తగ్గించినప్పుడు మీరేం చెప్పారు? స్కూల్ మెయింటెనెన్స్ ప్రభుత్వం చూసుకుంటుంది, మేం అధికారంలోకి వస్తే రూ.15,000 పూర్తిగా ఇస్తామన్నారు కదా! మరి ఇప్పుడెందుకు మాట తప్పారు? మరోవైపు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్కూళ్ల నిర్వహణ, నాడు -నేడుని పూర్తిగా అటకెక్కించారు. రాష్ట్రంలో ప్రీ-ప్రైమరీ కలుపుకుంటే యూడైస్ లెక్కల ప్రకారం 86 లక్షల మంది, వారిని తీసేస్తే సుమారు 80 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. రూ.15,000 చొప్పున లెక్కలేస్తే దాదాపు రూ.13,000 కోట్లు కావాలి. కానీ, ప్రభుత్వం బడ్జెట్ ప్రెజెంటేషన్‌లో రూ.9,648 కోట్లు చూపించి, రివైజ్డ్ బడ్జెట్‌లో దాన్ని రూ.8,456 కోట్లకు తగ్గించింది. వాస్తవంగా ఎంత రిలీజ్ చేశారో దేవుడికే తెలియాలి. నేను చెప్పేవాటిలో ఏ ఒక్కటైనా తప్పు ఉంటే నిరూపించండి, నా మాటలు వెనక్కి తీసుకుని సభకు క్షమాపణ చెబుతాను అని బొత్స సవాల్ విసిరారు.

**విద్యా వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టించిన లోకేశ్**

మా ప్రభుత్వంలో 'నాడు-నేడు' కింద మొదటి, రెండో విడతల్లో సుమారు 40,000 పాఠశాలలను బాగు చేయడానికి రూ.8,500 కోట్లు ఖర్చు పెట్టాం. కానీ నేడు ఆ పనులు ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లు నిలిచిపోయాయి. ఇప్పుడు చంద్రబాబు ఊర్లో వాళ్లు విరాళాలు ఇస్తేనే స్కూల్ పనులు పూర్తి చేస్తామంటున్నారు. ఏంటి ఈ కర్మ? రాజ్యాంగం ప్రకారం విద్య, వైద్యం, ఆహారం అందించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వంపై లేదా?

మా ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెడితే ఎన్నో విమర్శలు చేశారు. ఇప్పుడు ఇంగ్లీష్ మీడియం పోయింది, సీబీఎస్ఈ సిలబస్ లేదు, ఐబీ కరికులమ్ ఊసే లేదు. మేము తెచ్చిన టోఫెల్ శిక్షణ ఎక్కడ ఉందో చెప్పండి? 3వ తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్ విధానాన్ని తెచ్చి స్పెషలైజేషన్‌కు ప్రాధాన్యత ఇస్తే, ఇప్పుడు ఆ విధానాన్నే తీసేశారు. స్కూళ్లు ప్రారంభమై ఇన్ని నెలలైనా విద్యార్థులకు టెక్ట్స్‌బుక్స్, బట్టలు, నోట్‌బుక్స్, షూ, బెల్టులు సరిగ్గా ఇవ్వలేదు. మధ్యాహ్న భోజనంలో చిక్కీలు ఇచ్చే పర్యవేక్షణ కూడా లేదు. చిన్న చిన్న విషయాలను కూడా మానిటర్ చేయలేని ముఖ్యమంత్రి, కొండలు దాటిపోయే పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు అని బొత్స మండిపడ్డారు.

**ఉత్తరాంధ్రలో దోపిడీ**

ఉత్తరాంధ్ర ప్రాంతంలో కూటమి నేతల అరాచకాలు పెరిగిపోయాయి. ఒకవైపు గీతం సంస్థలకు చెందిన 50 ఎకరాల భూములను దోచేస్తున్నారు. పవిత్రమైన పంచదార కొండను మైనింగ్ పేరిట దోపిడీ చేస్తున్నారు. ఆంధ్రజ్యోతి పత్రికలో అశోక్ గజపతిరాజు గారి ఫోటో వేసి, నాటి అరాచకానికి నేడు అండ అని రాశారు. అసలు ఎవరిది అరాచకం? దీనిపై రేపు విజయనగరంలో పూర్తి వివరాలతో సమాధానం చెబుతాను. మా పార్టీ ఆఫీసు కట్టింది ఒక ఎకరం భూమిలోనే, అది కూడా శంకర్ ఫౌండేషన్‌తో పాటు గతంలో ప్రభుత్వం కేటాయించిందే. కంటికి కనిపిస్తున్న వందల ఎకరాల దోపిడీ వీరికి కనిపించడం లేదా? ఫీజ్ రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఈ ప్రభుత్వం ఇంకా రూ.10,000 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇవ్వలేనప్పుడు ఎందుకు అంత పెద్ద పెద్ద హామీలు ఇచ్చారు? పీ4 పథకం కనీసం 5 శాతం మందికైనా అమలు చేశారా? అమరావతిలో ఎలాంటి నిర్మాణాలు లేవు, కేవలం ఆ పేరుతో దోపిడీ చేస్తున్నారు. మేము గతంలో 'మావిగన్' అని చెబితే అవహేళన చేశారు, కానీ మూడు రోజుల క్రితం చంద్రబాబు రాజధాని గురించి మాట్లాడిన మాటలు వింటేనే వాస్తవాలు ఏంటో అర్థమవుతాయి. ప్రజల ఆశలతో రాజకీయం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని బొత్స ఎద్దేవా చేసారు.

**శవరాజకీయాలు సిగ్గుచేటు..**

వరదలు వచ్చినా, బోట్లు ప్రమాదానికి గురైనా వైఎస్. జగన్ బాధితులను పరామర్శించడానికి వస్తే, దాన్ని కూటమి నాయకులు 'శవరాజకీయం' అని విమర్శించడం సిగ్గుచేటు. గతంలో బోట్లు కాలిపోతే మా ప్రభుత్వం ఒక్కో బోటుకు రూ.35 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించి ఆదుకుంది. ప్రజల కష్టాలపై ప్రభుత్వం మానవత్వంతో స్పందించాలి కానీ, ప్రతిదానికి రాజకీయం మాట్లాడటం కరెక్ట్ కాదు. ప్రతిపక్ష నాయకుడు బాధితుల వద్దకు రాకూడదా? వస్తే రాజకీయం అంటారు, రాకపోతే ఎందుకు రాలేదని ప్రశ్నిస్తారు. రాజకీయాలు వేరు, మానవత్వం వేరు. ముద్రగడ పద్మనాభం గారి కుటుంబ సభ్యుల అంత్యక్రియల్లో ప్రభుత్వ లాంఛనాలు వద్దని వారి కుటుంబమే స్పష్టంగా చెప్పింది. దాన్ని కూడా రాజకీయం చేయడం తప్పు. లాంఛనాలు వద్దని కుటుంబ సభ్యులు అడ్డుకున్నప్పుడు అంబటి రాంబాబు గారు చేసింది ముమ్మాటికీ ఒప్పే అని బొత్స సత్యనారయణ సమర్థించారు.

**అవకతవకలపై యాప్**

ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియలో కొందరు అధికారులు నెంబర్లు పెంచుకోవాలనే తాపత్రయంతో అవకతవకలకు పాల్పడుతున్నారని... ఇలాంటి అక్రమాలు జరగకుండా ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకోవాలని బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం నడుస్తుందా? లేదా అనే అనుమానం కలుగుతోందన్నారు. ఏ చిన్న పని కావాలన్నా పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి తెచ్చారని మండిపడ్డారు వెన్నుపోటు పార్టీ (టీడీపీ) నాయకులు చేస్తున్న ఇలాంటి అరాచకాలను ఎప్పటికప్పుడు నమోదు చేసేందుకు, ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మేము ప్రత్యేకంగా ఒక యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు

## పార్లమెంట్‌కు కీలక బిల్లులు

మొదటి పేజీ తరువాయి...

నియంత్రణ సవరణ బిల్లు, 2026 విదేశీ నిధుల దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు ఈ సవరణను తీసుకురానున్నారు. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు, 2026 ఆలస్యంగా చేసే రిజిస్ట్రేషన్ల నిబంధనలను మరింత కఠినతరం చేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశ్యం. వీటితో పాటు విక్షిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు-2025, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు (33 నుంచి 37కి) బిల్లు, ఆదాయపు పన్ను సవరణ బిల్లు, మరియు ఎంఎస్ఎంఈ రంగ అభివృద్ధికి సంబంధించిన సవరణ బిల్లులను సభ ముందు ఉంచనున్నారు.

**రాజ్యాంగ సవరణ బిల్లులపై ఉత్కంఠ**

పార్లమెంట్ సభ్యులకు పంపిణీ చేసిన ప్రాథమిక అజెండాలో 130వ , 131వ రాజ్యాంగ సవరణ బిల్లులు లేనప్పటికీ, వాటి ప్రస్తావన ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వీటిని బిజినెస్ అడ్వైజరీ కమిటీ లో చర్చించి నిర్ణయం తీసుకుంటారా, లేదా నేరుగా సభలో ప్రవేశపెడతారా అనేది ఉత్కంఠ రేకెత్తిస్తోంది..సమావేశాల నిర్వహణలో భాగంగా ఎంపీల కోసం లోక్‌సభ సచివాలయం కఠినమైన మార్గదర్శకాలను జారీ చేసింది. సభలోకి స్మార్ట్ వాచీలు, స్మార్ట్ కళ్లద్దాలు, పెన్ కెమెరాల వంటి నిఘా పరికరాలను అనుమతించరు. అలాగే, పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, రాజకీయ నిరసనలకు పూర్తి నిషేధం విధించినట్లు అధికారులు పేర్కొన్నారు.

# విశాఖలో "జగన్ 2.0 సూపర్ యాప్" ఆవిష్కరణ

### ఆవిష్కరించిన జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు

### యాప్‌ను ప్రతి కార్యకర్త డౌన్‌లోడ్ చేసుకోవాలి

**విశాఖపట్నం, జూలై 17, జయ జయహే :**




వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్‌మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ అధికారంతో సంబంధం లేకుండా ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నారని జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన "జగన్ 2.0 సూపర్ యాప" ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, జగన్ అభిమానులు ప్రజల తరఫున పోరాటాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. గత 25 నెలలుగా కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యలను ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు నమోదు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, అధికార దుర్వినియోగం చేయడం వంటి చర్యలు కొనసాగుతున్నాయని విమర్శించారు. ఇలాంటి ఒత్తిళ్లు, వేధింపులు ఎదురైనా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వెనక్కి తగ్గకుండా ప్రజల పక్షాన పోరాడుతున్నారని స్పష్టం చేశారు. వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రతి సమస్యపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల తరఫున పోరాడాలన్నారు. తల్లికి వందనం" పథకంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు విరుద్ధంగా అనేక నిబంధనలు విధించి లక్షలాది మంది లబ్ధిదారులను అనర్హులుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అలాగే విశాఖపట్నం జివిఎంసిలో టెండర్ల కేటాయింపులో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తూ, తక్కువ కోట్ చేసిన కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి అదనపు శాతం చేర్చాలని కోరుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితులు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు కుంభ రవి బాబు , తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, పార్టీ పర్యవేక్షకులు రవి రెడ్డి , నియోజకవర్గ పరిశీలకులు జహీర్ అహ్మద్, పార్టీ నాయకులు కోలా గురువులు , సతీష్ వర్మ, పళ్ళ దుర్గ , జివి రామచంద్ర రాజు , దుప్పల్లపూడి శ్రీనివాస్ , పేర్ల విజయ చంద్ర, మహంతి పట్నాయక్ , జివి రవి రాజు , పివి సురేష్ , సేనాపతి అప్పారావు , అబంటి శైలేష్ , అల్లంపల్లి రాజ బాబు , ఆల్ఫ్ కృష్ణ , బర్కత్ అలీ , కోడిగుడ్ల పూర్ణిమ , రాయపురెడ్డి అనిల్ కుమార్ , శ్రీ దేవి వర్మ , దేవరకొండా మర్కడేయలు, కర్రి రామారెడ్డి పాల్గొన్నారు.



## ముద్రగడ సేవలు
# చిరస్మరణీయం

### రూరల్ వైసిపి నివాళి

**రాజమహేంద్రవరం: జయ జయహే: జూలై 17:**

కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి తీరని లోటని వైసిపి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. రాజమండ్రి రూరల్ బొమ్మూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ, సిద్ధాంతబద్ధంగా పోరాడిన యోధుడు ముద్రగడ అని, ఆయన కుటుంబానికి జగన్మోహన్ రెడ్డి అండగా ఉంటామని హామీ ఇవ్వడం వారి మధ్య ఉన్న అనుబంధానికి నిదర్శనమని అన్నారు. అంత్యక్రియల విషయంలో రాజకీయాలు చేసిన కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాష్ట్ర కార్యదర్శి నక్క రాజబాబు, గిరిజాల బాబు, యాదవుల స్టాలిన్, ముద్దాల అను, బొప్పన సుబ్బారావు, ఆచంట కళ్యాణ్, డబ్బింగ్ రమేష్, తాడాల చక్రవర్తి, తిరుమలశెట్టి శ్రీను, చాప రాజా, రుక్యా సయ్యద్, సింహాద్రి రామలక్ష్మి, షేక్ సమీరా, మండ రాజేష్, పిల్లా బాబీ, కేపీ నాయుడు, దాసరి శివ, సాపిరెడ్డి కామేష్, పందిళ్ళ భాను ప్రసాద్, చొల్లంగి సత్యగిరి, కొల్లి వెంకటరత్నం, దాసరి ధర్మ, ఓదురి రామకృష్ణ, వాసంశెట్టి శ్రీను, ఆరిగేలా హరీష్, బొడ్డేటి శివాజీ, షట్టర్ భాష, కుప్పల రాంబాబు, తోడేటి రాజా, కోటిపల్లి రవి, కాతేటి ఏసు, జల సత్యనారాయణ, సాక సతీష్, సంగీత రవితేజ, ఆకుల సుధాకర్, జీపీఆర్ నాయుడు, కామిరెడ్డి పెద్ద కాపు, చేదులూరి నాగేశ్వరరావు, ఉలిమి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులందరికీ రుణాలు

**మొదటి పేజీ తరువాయి...**

చిన్న బ్యాంకులను విలీనం చేసి సమర్థ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం తీసుకొచ్చారు. జనధన్ యోజన ద్వారా కోట్లాదిమందికి బ్యాంకు ఖాతాలిచ్చారు. జీఎస్టీ శ్లాబ్‌లు ఎక్కువ ఉండేవి చాలామంది నష్టపోయారు. రైతులు, పేదలకు న్యాయం జరిగేలా జీఎస్టీ శ్లాబులు మార్చారు. క్రియేటివ్‌గా ఆలోచించే సమర్థ మంత్రిగా నిర్మలను చూశాం. వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా చాలా సంస్కరణలు నిర్మల తీసుకొచ్చారు. రాబోయే రోజుల్లో 6 జిల్లాల్లో సమావేశాలు పెడదామంటే నిర్మల అంగీకరించారు. త్వరలోనే 3 నెలల ఒకటి, క్రెడిట్ అవుట్‌రీచ్ వంటి కార్యక్రమాలు. ఈ సమావేశాలకు నిర్మలా సీతారామన్ వస్తారని ఆమెను కోరుతున్నా. రెండేళ్లకు మునుపు రాష్ట్రంలో అంతా చీకటి, విధ్వంసం. ఎప్పుడూ చూడని ఆర్థిక సంక్షోభాన్ని చూశాం. ఎక్కడ చూసినా సమస్యల సుడిగుండమే. రాష్ట్రాన్ని మళ్లీ పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పాం. మళ్లీ బయటపడ్డామంటే కేంద్ర సహకారమే" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

# పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు

**మొదటి పేజీ తరువాయి...**

ప్లాట్‌ఫారమ్ టిక్కెట్ ఛార్జీల కంటే కూడా తక్కువ. ఈ రైల్లో మొత్తం 10 కోచ్‌లు ఉంటాయి. జింద్- సోనిపత్ మధ్య దాదాపు 90 కిలోమీటర్ల దూరాన్ని రెండు గంటల్లోనే పూర్తి చేస్తుంది. ఈ రైలు మార్గంలో 11 చోట్ల ఆగుతుంది. రోజుకు సుమారు 2,600 మంది ప్రయాణికులను తీసుకెళ్లనుంది. దీనిని స్వదేశీ హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీని ఉపయోగించి అభివృద్ధి చేశారు. ఇది సాంప్రదాయ ఓవర్‌హెడ్ విద్యుత్ తీగలు లేకుండా నడుస్తుంది. కార్బన్ ఉద్గారాలను విడుదల చేసే డీజిల్ రైళ్లలా కాకుండా.. ఈ హైడ్రోజన్ రైలు కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తుంది. దీంతో పర్యావరణానికి ఎలాంటి హాని కలగదు. ఈ రైలును నడపడానికి అవసరమైన గ్రీన్ హైడ్రోజన్‌ను జింద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్లాంట్ నుండి సరఫరా చేస్తారు. సురక్షితమైన కార్యకలాపాలను నిర్ధారించడానికి ఈ ప్రాజెక్ట్‌లో అధునాతన భద్రతా ఫీచర్లు కూడా ఉన్నాయి. విలాసవంతమైన సీట్లు ఉంటాయి. హైడ్రోజన్ లీక్ డిటెక్టర్లు, ఫ్లేమ్ డిటెక్షన్ సిస్టమ్‌లు, నిరంతర వెంటిలేషన్, ఆటోమేటెడ్ హైడ్రోజన్ షట్-ఆఫ్ మెకానిజమ్‌లు, లోకోమోటివ్ పైలట్‌ల కోసం రియల్-టైమ్ హెల్త్ మానిటరింగ్ వంటివి ఉన్నాయి. అత్యంత సౌకర్యవంతంగా ఇందులో ప్రయాణం చేయవచ్చు.



## ముగిసిన జీవిత, ఉపాసన నైపుణ్యాల శిక్షణ కార్యక్రమం

**చోడవరం జులై 17 జయ జయహే**

స్థానిక ఉషోదయ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మ్యాజిక్ బస్సు, ఇండియా ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో జీవిత నైపుణ్యాలు, ఉపాసన నైపుణ్యాలపై ఎనిమిది రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రోగ్రాం అధ్యక్షులు కళాశాల చైర్మన్ జె.రమణజీ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థిని, విద్యార్థులు విద్యుత్తో పాటు జీవిత నైపుణ్యాలును, ఉపాధి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకొని జీవితంలో స్థిరపడాలని సూచించారు. అలాగే నైపుణ్యాలతో ఉపాధి రంగాన మేటిగా రాణించాలని విద్యార్థులను చెప్పారు. ఈ కార్యక్రమంలో కుమారి కె.అనూష మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ శిక్షకురాలు విద్యార్థులకు సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాల డిజిటల్ అవగాహన వంటి పది అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జె.కృష్ణకుమారి, డైరెక్టర్ జె.శ్యామ్జి,డీన్ ఎస్.వి.వాసు, ప్రిన్సిపల్ ఎస్. ఎన్. నాయుడు, వైస్ ప్రిన్సిపల్ పి.దొరబాబు, కోర్ కమిటీ సభ్యులు ఇతర అధ్యాపకుల బృందం, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# టీకాల కార్యక్రమం

### ఆకస్మిక తనిఖీ చేసిన ఏడి

**మాడుగుల జూలై 17 జయ జయహే**



మాడుగుల నియోజకవర్గ పరిధిలో గల.కే.కోటపాడు మండలం వి.సంత పాలెం గ్రామంలో జరుగుతున్న ఉచిత గొంతు వాపు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని కే. కోటపాడు ఏరియా పశు వైద్య శాల ఇంచార్జి సహాయ సంచాలకులు డా. వి. చిట్టి నాయుడు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడి రైతులు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని టీకాలు వేయించుకుంటే పశువులకు గొంతు వాపు వ్యాధి రాదని తెలిపారు. ఈ కార్యక్రమం లో కొరువాడ పశు వైద్యాధికారి డా. సింహాచలం నాయుడు, పశు సంవర్ధక సహాయకులు మంగ, హనుమంతు పాల్గొన్నారు. ఈ శిబిరంలో మొత్తం 80 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు.



## విద్యుత్ ఉద్యోగుల కొత్త టీమ్ రెడీ

**రాజమహేంద్రవరం జయ జయహే జులై 17**

స్థానిక మోరంపూడి ఎపిఎస్ఈబి ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్లో విద్యుత్ ఓసి ఉద్యోగుల సర్వసభ్య సమావేశం ఘనంగా జరిగింది. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె .శ్రీనివాస్, డి.వి.రంగారావుల సమక్షంలో, ప్రభుత్వంతో సానుకూల చర్చలు జరుపుతున్నట్లు నేతలు వెల్లడించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీతో పిఆర్సీ, డిఎ ల అమలుపై ఆశలు చిగురించాయి. 2004 వరకు ఉన్న ఉద్యోగులకు ఈపిఎఫ్, జిపిఎఫ్ అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది:అధ్యక్షుడు: పి.చక్రపాణి, కార్యదర్శి: కె.వి.వి.రమణ, ట్రెజరర్:కె.రామకృష్ణ వర్కింగ్ ప్రెసిడెంట్:డి.వీర్రాజు అసోసియేట్ ప్రెసిడెంట్లు: జ్యోతులవీరబాబు, జి.రఘురామ్, కుమార్ ఈ కార్యక్రమంలో తురగా రామకృష్ణ, డి.వి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## గంజాయి రహిత సమాజమే లక్ష్యం:

### డిఎస్పీ శివప్రియ

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూలై 17**

బొమ్మూరు:మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తాయని, గంజాయి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సౌత్ జోన్ డిఎస్పి ఎ. శివప్రియపిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిశోర్,ఆదేశాల మేరకు శాటిలైట్ సిటీలో నిర్వహించిన గంజాయి నివారణ అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగాపాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "మత్తు పదార్థాలకు బానిస కావడం అంటే మన వ్యక్తిత్వాన్ని, ఆరోగ్యాన్ని, ఆర్థిక స్థిరత్వాన్ని మనమే నాశనం చేసుకోవడమే" అని హెచ్చరించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే సామాజిక, ఆర్థిక దుష్పరిణామాలపై యువతకు అవగాహన కల్పించారు. బొమ్మూరు ఇన్‌స్పెక్టర్పి. కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ, గంజాయి రవాణా, విక్రయం లేదా వినియోగం చట్టరీత్యా నేరమని,ఎన్డీపిఎస్ చట్టం ప్రకారం కఠిన కారాగార శిక్ష తప్పదని స్పష్టం చేశారు. అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మహిళలు స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గోసేవయే గోవిందుడి సేవ- గోరక్షణయే ధర్మ రక్షణ

### డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తి.తి.దే.

### ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు

**నందికొట్కూరు (జయ జయహే)**

భారతీయ సంస్కృతిలో గోమాతకు విశిష్ట స్థానం ఉన్నదని, గోవును ఒకసాధారణ జంతువులాగా చూడడం మానవీయ దృష్టిఅని, భూమిపై నడయాడే ఒక అపురూప జీవి అనుకోవడం భారతీయమైన ఆలోచన అని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణం, మారుతీనగర్ లోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంనందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం సామూహిక గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు జూలకంటి రవితేజ శర్మ ఆధ్వర్యంలో వేదోక్తంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ చిన్నావుల వేంకట రాజారెడ్డి మూడు రోజులుపాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, శ్రీ వేంకటాచల మహత్యంపై చేసిన ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేయడంపట్ల శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ కౌన్సిలర్ జి.భాస్కర రెడ్డి, సాయిరాం విద్యాసంస్థల అధినేత పల్లా సుధాకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తి.తి.దే. ధర్మ ప్రచార మండలి సభ్యులు అంబటి శివశంకర రెడ్డి, సాయిరాం కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, స్కాలర్స్ ఇ. మీ. ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ కాళ్ళూరి శ్రీలక్ష్మి, ఎల్. రామలక్ష్మయ్య, రామానాయుడుతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## నిర్మాణాల్లో నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలి

### ఎమ్మెల్యే ఆదిరెడ్డి

**రాజమహేంద్రవరం: జయ జయహే:జూలై 17:**

వి.ఎల్.పురం శ్యామలాంబ మున్సిపల్ హైస్కూల్‌లో రూ.80 లక్షల సి.ఎస్.ఆర్ నిధులతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల సౌకర్యార్థం చేపట్టిన ఈ పనులను ఎక్కడా రాజీ పడకుండా నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. పాఠశాల అప్‌గ్రేడ్ కావడంతో పెరిగిన విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా తొలి దశలో నాలుగు విశాలమైన గదులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్చార్జ్ కంటిపూడి రాజేంద్రప్రసాద్, అడబాల రాజా, ఇంజనీర్ మాణిక్యాలరావు, కూర్పు రామారావు, ఐ.కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహో




## దేశంలో ఉద్యోగాల కొరత కాదు...

# నైపుణ్యాల కొరతే ప్రధాన సమస్య

(సి.హెచ్.ప్రతాప్)

భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం. సుమారు 36.7 కోట్ల మంది యువత (15--29 సంవత్సరాల వయస్సు) దేశ శ్రామిక శక్తికి వెన్నెముకగా నిలిచే సామర్థ్యం కలిగి ఉన్నారు. అయితే ఈ జనాభా ప్రయోజనం, సరైన నైపుణ్యాలు లేకపోతే భారంగా మారే ప్రమాదం ఉంది. ఇటీవల విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం, 15--29 ఏళ్ల యువతలో నిరుద్యోగిత రేటు 2025లో 9.9 శాతంగా నమోదైంది, పట్టణ ప్రాంతాల్లో ఇది 13.6 శాతం వరకు ఉంది.

సమస్య ఉద్యోగాల లేమి మాత్రమే కాదు; ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు లేకపోవడమే మరింత తీవ్రమైన సవాలు. పరిశ్రమలు వేలాది ఖాళీలను ప్రకటిస్తున్నప్పటికీ, తగిన నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులను కనుగొనడం కష్టంగా మారుతోందని యాజమాన్యాలు చెబుతున్నాయి. 2026లో విడుదలైన ఇండియా స్కిల్స్ రిపోర్ట్ ప్రకారం దేశంలో ఉద్యోగయోగ్యత 56.35 శాతానికి చేరినప్పటికీ, దాని అర్థం ఇంకా దాదాపు నాలుగురిలో ఇద్దరు యువకులు ఉద్యోగానికి పూర్తిగా సిద్ధంగా లేరనే విషయమే.

ఉద్యోగ రంగం వేగంగా మారుతోంది. కృత్రిమ మేధ , డేటా సైన్స్, సైబర్ భద్రత, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్, పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ తయారీ వంటి రంగాల్లో కొత్త అవకాశాలు విస్తరిస్తున్నాయి. ఎన్ఐటీ భారత నైపుణ్య లోటు అధ్యయన నివేదిక 2026 ప్రకారం, భవిష్యత్ ఉద్యోగాల్లో అత్యంత అవసరమైన నైపుణ్యాలుగా కృత్రిమ మేధస్సు, డిజిటల్ టెక్నాలజీ, డేటా విశ్లేషణ, సైబర్ భద్రత నిలుస్తున్నాయి. పరిశ్రమలు ఇప్పుడు డిగ్రీల కంటే నైపుణ్యాలకు, అనుభవానికి, పరిశ్రమ గుర్తింపు పొందిన ధ్రువపత్రాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి.

అయితే మన విద్యా వ్యవస్థ ఇంకా పరీక్షలు, మార్కులు, కంఠస్థ విద్య చుట్టూనే తిరుగుతోంది. విద్యార్థుల్లో సమస్య పరిష్కార సామర్థ్యం, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, డిజిటల్ అవగాహన, బృందంతో కలిసి పనిచేసే నైపుణ్యాలను పెంపొందించే దిశగా విద్య పూర్తిగా మారలేకపోయింది. డిగ్రీలు పెరుగుతున్నా, ఉద్యోగానికి అవసరమైన సామర్థ్యం అదే స్థాయిలో పెరగడం లేదు. ఈ అసమతుల్యతే ఉపాధి సంక్షోభానికి మూలకారణం.

ఈ పరిస్థితిని మార్చాలంటే విద్యా విధానంలో మౌలిక సంస్కరణలు అత్యవసరం. కంఠస్థ విద్యకు బదులుగా ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, ప్రయోగాత్మక శిక్షణ, పరిశ్రమలతో భాగస్వామ్యం, ఇంటర్న్‌షిప్‌లు, డిజిటల్ నైపుణ్యాలు, కృతిమ మేధస్సు ప్రాథమిక అవగాహన, సూక్ష్మ నైపుణ్య ధ్రువపత్రాలు విద్యలో అంతర్భాగం కావాలి. విద్యార్థి ఆసక్తి, సామర్థ్యానికి అనుగుణంగా అనువైన కోర్సులు అందుబాటులోకి రావాలి. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పే వారిగా కాకుండా, భవిష్యత్ నైపుణ్యాలను తీర్చిదిద్దే మార్గదర్శకులుగా మారాలి.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ₹1,237 కోట్ల వ్యయంతో ఐదు ఐటీఐ క్లస్టర్లను ఆధునీకీకరించడం, దేశవ్యాప్తంగా 200 ఐటీఐల్లో ప్రధానమంత్రి- సేతు కార్యక్రమాన్ని అమలు చేయడం వంటి చర్యలు ప్రారంభించడం సరైన దిశలో అడుగే. అయితే ఈ ప్రయత్నాలు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల వరకు విస్తరించినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి.

2026 సంవత్సరం భారత విద్యా వ్యవస్థకు ఒక కీలక మలుపుకావాలి. "ఇప్పటికే ఉన్న ఉద్యోగాలకు విద్య" అనే ఆలోచన నుంచి "రేపు రూపుదిద్దుకోబోయే ఉద్యోగాలకు నేటి శిక్షణ" అనే దిశగా ప్రయాణించాల్సిన సమయం ఆసన్నమైంది. భారత యువశక్తిని ప్రపంచానికి నైపుణ్యవంతమైన మానవ వనరుగా తీర్చిదిద్దాలంటే విద్యా విధానం, పరిశ్రమలు, ప్రభుత్వం, సమాజం కలిసి పనిచేయాలి. భవిష్యత్ ఉద్యోగాలకు అనుగుణమైన విద్య ఇకపై ఒక నినాదం కాదు; భారత అభివృద్ధికి అత్యవసరమైన జాతీయ కార్యాచరణగా మారాలి.

# సంక్షోభంలో సాగు... ఆందోళనలో అన్నదాత

### వ్యవసాయం చేయాలా... వద్దా? అనే సంఘర్షణలో రైతు

### అనిశ్చిత వర్షాలు... పెరిగిన సాగు ఖర్చులు... అందని గిట్టుబాటు ధరలు...

### ప్రకృతి నుంచి మార్కెట్ వరకు ప్రతి అడుగులోనూ రైతుకు అగ్నిపరీక్షే

**దేశానికి అన్నం పెట్టే రైతు నేడు తీవ్రమైన అనిశ్చితి మధ్య సాగు కొనసాగిస్తున్నాడు.. ఒకప్పుడు ఖరీఫ్ సీజన్ అంటే ఆశలు, ఆనందానికి ప్రతీక. ఇప్పుడు అదే సీజన్ రైతుకు ఆందోళనకు మరో పేరుగా మారింది. పొలంలో అడుగుపెట్టే ముందు "ఈసారి సాగు చేయాలా... వద్దా?" అనే ప్రశ్న ప్రతి రైతు మనసులో మెదులుతోంది. పంట వేస్తే వర్షం పడుతుందో లేదో తెలియదు. వర్షం పడినా పంట నిలుస్తుందనే హామీ లేదు. పంట బాగా పండినా గిట్టుబాటు ధర వస్తుందనే నమ్మకం లేదు.**

**పెరుగుతున్న పెట్టుబడులు, మారుతున్న వాతావరణం, అస్థిరమైన మార్కెట్ పరిస్థితుల మధ్య రైతు ప్రతి సీజన్‌ను ఒక కొత్త పరీక్షగా ఎదుర్కొంటున్నాడు. దేశ ఆహార భద్రతకు వెన్నెముకగా నిలిచిన అన్నదాత నేడు తన భవిష్యత్తుపైనే ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది.**



#### ఖరీఫ్ ప్రారంభమే కఠిన పరీక్ష

ఈ ఏడాది అనేక ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాల పురోగతి ఆశించినంతగా లేకపోవడంతో విత్తనాల విత్తకం ఆలస్యమైంది. తొలకరి వర్షాలను నమ్మి విత్తిన రైతులు తర్వాత వర్షాలు ఆగిపోవడంతో మళ్లీ విత్తే పరిస్థితి ఎదురైంది. మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ సమయంలో కురిసిన భారీ వర్షాలు పొలాల్లో నీరు నిలిచే పరిస్థితిని సృష్టించాయి. ఒకే జిల్లాలో ఒక మండలంలో వర్షాభావం, మరో మండలంలో అధిక వర్షపాతం కనిపించడం రైతు ప్రణాళికలను పూర్తిగా దెబ్బతీస్తోంది.

వాతావరణ మార్పులు ఇప్పుడు శాస్త్రీయ చర్చలకే పరిమితం కావడం లేదు. అవి రైతు పొలంలోనే ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు కాలాన్ని బట్టి సాగు చేసేవారు. ఇప్పుడు వాతావరణ సూచనలను బట్టి కూడా నిర్ణయం తీసుకోవడం కష్టంగా మారింది.

#### పెట్టుబడులు పెరిగినా రైతు ఆదాయం పెరగడం లేదు

వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం ఏటా పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా ఇటీవల కాంప్లెక్స్ ఎరువుల ధరలు 20 నుంచి 30 శాతం వరకు పెరగడం రైతుపై అదనపు భారం మోపింది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కలుపు నివారణ మందులు, డీజిల్, విద్యుత్, యంత్రాల అద్దె, కూలీల వేతనాలు అన్నీ పెరిగాయి.

ఒక ఎకరం సాగుకు అయ్యే ఖర్చు గణనీయంగా పెరిగినా, రైతు చేతికి మిగిలే ఆదాయం మాత్రం పెరగడం లేదు. పెట్టుబడిలో ఎక్కువ భాగం అప్పుల ద్వారానే సమకూర్చుకోవాల్సి వస్తుండటంతో పంట కోత వరకు రైతు ఆర్థిక ఒత్తిడిలోనే జీవిస్తున్నాడు.

#### గిట్టుబాటు ధర రైతుకు అందని ద్రాక్ష

రైతు సమస్య పంట పండించే వరకు కాదు. పంట అమ్మే సమయంలోనే అసలు సంక్షోభం మొదలవుతోంది. దిగుబడి బాగుంటే ధరలు పడిపోతాయి. ధరలు పెరిగితే దిగుబడి తగ్గుతుంది. కనీస మద్దతు ధర ప్రకటించినా ప్రతి రైతుకు అది అందడం లేదు.

స్థానిక మార్కెట్లలో మధ్యవర్తుల ఆధిపత్యం, గిడ్డంగుల కొరత, శీతల నిల్వ కేంద్రాల లేమి, ప్రాసెసింగ్ పరిశ్రమల కొరత వల్ల రైతు తప్పనిసరిగా తక్కువ ధరకే పంటను విక్రయించాల్సి వస్తోంది. అత్యధిక శ్రమ రైతుదే అయినా, అత్యల్ప లాభం కూడా రైతుకే దక్కడం బాధాకరం.

#### ఎరువుల సరఫరా, బ్లాక్ మార్కెట్ మరో సమస్య

దేశంలో వినియోగించే ఫాస్పేటిక్, పొటాషిక్ ఎరువుల ముడి పదార్థాల్లో అధిక భాగం దిగుమతులపైనే ఆధారపడి ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల మార్పులు దేశీయ ధరలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి.

దీనికి తోడు కొన్నిచోట్ల ఎరువుల కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం, అవసరం లేని ఉత్పత్తులను రైతులకు బలవంతంగా కొనిపించడం వంటి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది..

#### నేల ఆరోగ్యం క్షీణిస్తే వ్యవసాయం నిలవదు

రసాయన ఎరువుల అధిక వినియోగం, సేంద్రియ పదార్థాల వినియోగం తగ్గిపోవడం, మట్టి పరీక్షలు చేయకుండా ఎరువులు వేయడం వల్ల భూమి సారం క్రమంగా తగ్గుతోంది. నేల ఆరోగ్యం దెబ్బతింటే దిగుబడి మాత్రమే కాదు, రైతు ఆదాయం కూడా తగ్గుతుంది.

ప్రతి గ్రామంలో మట్టి పరీక్షలు, సమతుల్య ఎరువుల వినియోగం, జీవ ఎరువులు, సేంద్రియ ఎరువులు, పంట మార్పిడి వంటి పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

#### వ్యవసాయానికి దూరమవుతున్న యువత

ఒకప్పుడు వ్యవసాయం గౌరవప్రదమైన జీవన విధానం. ఇప్పుడు అది అధిక ప్రమాదం ఉన్న వృత్తిగా యువత భావిస్తోంది. పెట్టుబడి ఎక్కువ, లాభం అనిశ్చితం, ప్రకృతి అనుకూలించకపోవడం, మార్కెట్‌లో స్థిరత్వం లేకపోవడం వల్ల యువత ఇతర రంగాల వైపు మొగ్గు చూపుతోంది.

ఈ ధోరణి కొనసాగితే భవిష్యత్తులో దేశ ఆహార భద్రతపైనా తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది.

#### రైతు కోసం మారాల్సిన విధానాలు

వ్యవసాయ విధానాలు కేవలం ఉత్పత్తి పెంపుకే పరిమితం కాకూడదు. రైతు ఆదాయ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యవసాయ, ఉద్యాన శాఖల్లో ఖాళీగా ఉన్న క్షేత్రస్థాయి పోస్టులను భర్తీ చేయాలి. గ్రామస్థాయిలో మట్టి పరీక్షలు, వాతావరణ సమాచారం, శాస్త్రీయ సాగు సలహాలు అందుబాటులోకి తీసుకురావాలి. ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను కఠినంగా అరికట్టాలి. జీవ ఎరువులు, సేంద్రియ వ్యవసాయం, సూక్ష్మ సేద్య పద్ధతులకు ప్రోత్సాహం పెంచాలి. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేసి నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేయాలి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట బీమా పరిహారం వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలి.

#### రైతుకు భరోసా ఇవ్వాల్సిన సమయం ఇదే

రైతు అడుగుతున్న ప్రశ్న తన కుటుంబం గురించే కాదు. దేశ ఆహార భద్రత గురించీ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ గురించీ, రాబోయే తరాల భవిష్యత్తు గురించీ. రైతు నిలబడితేనే వ్యవసాయం నిలుస్తుంది. వ్యవసాయం నిలిస్తేనే దేశం నిలుస్తుంది.

రైతుకు అవసరమైంది తాత్కాలిక ఉపశమన పథకాలు కాదు. పంటకు న్యాయమైన గిట్టుబాటు ధర, నాణ్యమైన విత్తనాలు, అందుబాటులో ఎరువులు, సమయానికి శాస్త్రీయ సలహాలు, పారదర్శక మార్కెట్ వ్యవస్థ, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ కల్పించే సమర్థవంతమైన పంట బీమా, సాగుపై నమ్మకాన్ని పెంచే దీర్ఘకాలిక వ్యవసాయ విధానాలు.

నేడు రైతు ఎదుట నిలిచిన అతిపెద్ద ప్రశ్న ఒక్కటే... "వ్యవసాయం చేయాలా... వద్దా?" ఈ ప్రశ్న ఒక రైతుదే కాదు, దేశం ముందున్న ప్రశ్న. ఈ సందేహం రైతు మనసులో ఉన్నంతకాలం వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి బయటపడదు.

రైతు వ్యవసాయం వైపు ధైర్యంగా అడుగు వేసే వాతావరణాన్ని కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. రైతు పండించిన పంటకు గౌరవం, రైతు శ్రమకు న్యాయం, రైతు జీవితానికి భరోసా లభించిన రోజే భారత వ్యవసాయం నిజమైన అర్థంలో బలపడుతుంది. ఎందుకంటే రైతును కాపాడటం అంటే కేవలం ఒక వృత్తిని కాపాడటం కాదు... దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, భారత భవిష్యత్తును కాపాడటమే..

**జి. అజయ్ కుమార్**
**వ్యవసాయ నిపుణులు**

# విపత్తు నిర్వహణలో జాతీయ దృక్పథం అవసరం

(సి.హెచ్.ప్రతాప్)

**ప్రకృతి వైపరీత్యాలు గతంతో పోలిస్తే ఇప్పుడు మరింత తరచుగా, తీవ్రంగా సంభవిస్తున్నాయి. వరదలు, తుఫానులు, భూకంపాలు, కొండచరియలు విరిగిపడటం వంటి ఘటనలు దేశంలోని అనేక ప్రాంతాలను కుదిపేస్తున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో ఈ విపత్తుల తీవ్రత మరింత పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం-రాష్ట్రాల మధ్య సమర్థవంతమైన సమన్వయం అత్యవసరంగా మారింది. విపత్తు సంభవించినప్పుడు ప్రజలు ఎదురుచూసేది రాజకీయ ప్రకటనలను కాదు, వేగవంతమైన సహాయ చర్యలను.**



గత సంవత్సరం ఈశాన్య భారత రాష్ట్రాల్లో, ముఖ్యంగా అసోంలో సంభవించిన భారీ వరదలు లక్షలాది మంది జీవితాలను అతలాకుతలం చేశాయి. అనేక గ్రామాలు జలమయం కావడంతో వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ఈ పరిస్థితుల్లో సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాల మధ్య సమన్వయం కీలక పాత్ర పోషించింది. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో వనరుల కొరత, రవాణా అంతరాయాలు వంటి సవాళ్లు కూడా ఎదురయ్యాయి. మరోవైపు దేశవ్యాప్తంగా వరదల ముప్పును దృష్టిలో ఉంచుకుని పలు రాష్ట్రాల్లో మాక్ డ్రిల్లులు నిర్వహించడం, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను పరీక్షించడం వంటి చర్యలు విపత్తు నిర్వహణలో సన్నద్ధతకు, పరస్పర సమన్వయానికి పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇటువంటి సమన్వయ లోపం ఇకపై తిరిగి పునరావృతం కాకూడదన్నదే ప్రజల అభిమతం.

భూకంపాల విషయంలోనూ అప్రమత్తత అవసరం పెరిగింది. 2026 ప్రారంభ నెలల్లోనే దేశంలో వందల సంఖ్యలో భూకంప ప్రకంపనలు నమోదయ్యాయి. ఢిల్లీ ప్రాంతంలోనూ భూకంపం సంభవించడం పట్టణ ప్రాంతాల సన్నద్ధతపై ప్రశ్నలు లేవనెత్తింది. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ , రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థలు , జాతీయ విపత్తు స్పందన దళం , రాష్ట్ర విపత్తు స్పందన బృందాలు ఒకే వేదికపై పనిచేయాల్సిన అవసరం ఉంది.

అయితే విపత్తు నిర్వహణలో ప్రధాన సవాలు సహాయ నిధుల పంపిణీ చుట్టూనే తిరుగుతోంది. రాష్ట్రాలు కేంద్రం తగినంత సహాయం అందించడం లేదని ఆరోపిస్తుంటే, కేంద్రం నిబంధనల ప్రకారమే నిధులు విడుదల చేస్తున్నామని చెబుతోంది. ఈ వివాదాల మధ్య బాధిత ప్రజల అవసరాలు వెనుకబడే ప్రమాదం ఉంది. రాష్ట్ర విపత్తు స్పందన నిధి , జాతీయ విపత్తు ఉపశమన నిధి వంటి వ్యవస్థలు ఉన్నప్పటికీ నిధుల విడుదల, అంచనాల ప్రక్రియలు మరింత వేగవంతం కావాలి.

విపత్తు సమయంలో రాజకీయ భేదాలు పక్కన పెట్టడం ప్రజాస్వామ్య బాధ్యత. బాధితులు ఏ పార్టీకి చెందినవారు కాదు; వారు భారత పౌరులు. అందువల్ల సహాయ చర్యల విషయంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పర ఆరోపణల కంటే పరస్పర సహకారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఒక రాష్ట్రంలో వరదలు వస్తే పొరుగు రాష్ట్రాల వనరులను కూడా వినియోగించే విధంగా ప్రాంతీయ సహకార వ్యవస్థలను బలోపేతం చేయాలి.

మరో కీలక అంశం సాంకేతిక పరిజ్ఞానం వినియోగం. ఉపగ్రహ చిత్రాలు, కృత్రిమ మేధస్సు ఆధారిత అంచనాలు, మొబైల్ హెచ్చరిక వ్యవస్థలు, రియల్ టైమ్ సమాచార మార్పిడి వేదికలు విపత్తు ప్రభావాన్ని గణనీయంగా తగ్గించగలవు. దేశవ్యాప్తంగా అత్యవసర హెచ్చరికల కోసం రూపొందించిన డిజిటల్ వ్యవస్థలు గ్రామీణ ప్రాంతాల వరకు సమర్థంగా చేరాలి.

భారతదేశ భౌగోళిక పరిస్థితులను పరిశీలిస్తే భూకంపాలు, వరదలు, తుఫానులకు విస్తారమైన ప్రాంతాలు గురయ్యే అవకాశం ఉంది. దేశ భూభాగంలో గణనీయమైన భాగం భూకంపాలకు, కోట్లాది హెక్టార్లు వరదలకు సున్నితంగా ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. అందువల్ల విపత్తు నిర్వహణను కేవలం సహాయక చర్యలకే పరిమితం చేయకుండా, ముందస్తు ప్రణాళిక, ప్రమాద నివారణ, సామాజిక అవగాహన, శిక్షణ వంటి అంశాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. విపత్తు సంభవించిన తర్వాత స్పందించడం కంటే, సంభవించే ముందే సిద్ధంగా ఉండటం ఉత్తమ వ్యూహం. కేంద్రం-రాష్ట్రాల సమన్వయం బలపడితేనే ప్రాణనష్టం తగ్గుతుంది, ఆస్తినష్టం నియంత్రణలో ఉంటుంది. ప్రకృతి విపత్తులు రాజకీయ సరిహద్దులను గుర్తించవు; అందుకే వాటి నిర్వహణలోనూ జాతీయ దృక్పథమే మార్గదర్శకం కావాలి. ప్రజల ప్రాణ రక్షణే పరమ లక్ష్యమనే భావనతో కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేయడం కాలానుగుణ అవసరం.

## వైయస్సార్ మహిళా సదస్సులో
# 2029 ఎన్నికలే లక్ష్యంగా కార్యాచరణ






**అరకులోయ, జూలై 18: జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా ప్రతినిధుల సదస్సు అరకు వ్యాలీ రణజిల్లేడ సమీపంలోని వీ రిసార్ట్స్‌లో శుక్రవారం నిర్వహించబడింది. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఉత్తరాంధ్ర జోనల్ అధ్యక్షురాలు, జిల్లా ఛైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పార్టీకి చెందిన పలువురు రాష్ట్ర స్థాయి మహిళా నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు హాజరై మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుధు కల్యాణి, అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనూజ రాణి పాల్గొని మహిళా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మాట్లాడిన మహిళ నాయకులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో మహిళలకు కల్పించిన గౌరవం, సాధికారత, సంక్షేమ పథకాలు, మహిళా అభ్యున్నతి కోసం చేపట్టిన అనేక కార్యక్రమాలను గుర్తు చేశారు. వైయస్సార్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత బలపరిచి ప్రతి ఇంటికి, ప్రతి గ్రామానికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మహిళా కార్యకర్తలపై ఉందని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు మహిళలు ఐక్యతతో, అంకితభావంతో పార్టీ కోసం పనిచేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయని, మహిళల భద్రత విషయంలో కూడా ప్రజల్లో ఆందోళన నెలకొన్నదని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, మహిళల భద్రత, పేదల అభ్యున్నతి కోసం 2029 ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాలనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త పనిచేయాలని సమావేశంలో మహిళ నాయకులు పిలుపునిచ్చారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ప్రతి సంవత్సరం వర్షాకాలం ప్రారంభానికి ముందు మెడికల్ యాక్షన్ ప్లాన్ రూపొందించి, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని మహిళ నాయకులు అభిప్రాయపడ్డారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని, ఫలితంగా గిరిజన ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో మలేరియా బాధితుల సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతోనే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు అని వారు గుర్తు చేశారు. అలాగే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకం వలన గిరిజన ప్రాంతాల ప్రజలకు పెద్దగా ఉపయోగపడటం లేదని, అనేక గ్రామాలకు ఇప్పటికీ సరైన రహదారి సౌకర్యాలు లేక ప్రజలు డోలిమోతల పై ఆధారపడవలసిన పరిస్థితి కొనసాగుతోందని విమర్శించారు. ముందుగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, మౌలిక సదు-పాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. అనంతరం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం “జగనన్న 2.0” యాప్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించి, ప్రతి కార్యకర్త మరియు ప్రజలు ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుధు కల్యాణి, మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనూజ రాణి, మాజీ ఎమ్మెల్యేలు శోభ హైమవతి, కళావతి, అరకు అసెంబ్లీ మహిళా విభాగం అధ్యక్షురాలు సమీడా వెంకట పూర్ణిమ, మాజీ జీసీసీ ఛైర్పర్సన్ శోభా స్వాతి రాణి, మహిళా జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, రాష్ట్ర, జిల్లా, మండల, పంచాయితీ స్థాయి మహిళా పార్టీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## మాడుగుల డిగ్రీ కళాశాల భవనాలకు రేపు ప్రారంభోత్సవం

**మాడుగుల జులై 17 జయ జయహే**

మాడుగులలో గల డిగ్రీ కళాశాలకు ఎట్టకేలకు వసతి సమస్య పరిష్కారమైంది. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి చొరవతో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ సహకారంతో సుమారు కోటి 50 లక్షల రూపాయలతో నూతన భవనాలను నిర్మించారు. భవనాలకు ఈ నెల 19న అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్,స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించనున్నట్టు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు. ఇప్పటివరకు ఈ డిగ్రీ కళాశాల కొన్నాళ్లు జూనియర్ కళాశాలలో, మరి కొంతకాలం బాలికల వసతిగృహంలోనూ కొనసాగించారు. ఏట్టకేలకు నూతన భవనాలను నిర్మించగలిగారు. కాబట్టి గ్రామ ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఏపీ షైనింగ్ స్టార్స్ అవార్డుకు విద్యార్థుల ఎంపిక

**మాడుగుల, జూలై 17, జయ జయహే**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన నాజ--2025 “ఏపీ షైనింగ్ స్టార్స్ అవార్డు” కోసం విడుదల చేసిన అనకాపల్లి జిల్లా మండలాల వారీ మెరిట్ విద్యార్థుల జాబితాలో మాడుగుల మండలానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. మాడుగుల సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు, శివయ్య పాఠశాలకు చెందిన ఒక విద్యార్థి, కింతలి హై స్కూల్ కి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు ఎంఈఓ దేవుడమ్మ తెలిపారు. వారిలో కుర్రాళ్ల శ్రీహిత, మహతో సిద్ధార్థ, షేక్ సమీరా, మై చర్ల లికిత, శ్రీధర్ వెంకట జస్వంత్, చెక్క జెసి ఉన్నారు.వీరు తమ కృషి, పట్టుదల, క్రమశిక్షణతో ఈ ప్రతిష్టాత్మక గుర్తింపును సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారని ఎంఈఓ పేర్కొన్నారు. యాజమాన్యం ప్రశంసించింది. ఎంపికైన విద్యార్థులకు 20 వేల రూపాయల నగదు బహుమతి ప్రశంస పత్రం అందజేసే సత్కరిస్తారన్నారు. వీరికి ఈ నెల 20న అనకాపల్లి లో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందజేస్తామన్నారు. ప్రతిభ ఆధారంగా ఈ విద్యార్థులను ఎంపిక చేశారని చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థుల విజయం వెనుక ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల నిరంతర శ్రమ కీలక పాత్ర పోషించాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా మరింత మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## వినాయక స్వామిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్

**పూతలపట్టు, జూలై 17, జయ జయహే**

శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయకస్వామివారిని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఈఓ పెంచల కిషోర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేశారు.కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ప్రోటోకాల్ ఏఈఓ ధనపాల్, సూపర్డెంట్ కోదండపాణి, తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరికీ రుణాలు

**మొదటి పేజీ తరువాయి...**

చిన్న బ్యాంకులను విలీనం చేసి సమర్థ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం తీసుకొచ్చారు. జనధన్ యోజన ద్వారా కోట్లాదిమందికి బ్యాంకు ఖాతాలిచ్చారు. జీఎస్టీ శ్లాబ్‌లు ఎక్కువ ఉండేవి చాలామంది నష్టపోయారు. రైతులు, పేదలకు న్యాయం జరిగేలా జీఎస్టీ శ్లాబులు మార్చారు. క్రియేటివ్‌గా ఆలోచించే సమర్థ మంత్రిగా నిర్మలను చూశాం. వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా చాలా సంస్కరణలు నిర్మల తీసుకొచ్చారు. రాబోయే రోజుల్లో 6 జిల్లాల్లో సమావేశాలు పెడదామంటే నిర్మల అంగీకరించారు. త్వరలోనే 3 నెలల ఒకటి, క్రెడిట్ అవుట్‌రీచ్ వంటి కార్యక్రమాలు. ఈ సమావేశాలకు నిర్మలా సీతారామన్ వస్తారని ఆమెను కోరుతున్నా. రెండేళ్లకు మునుపు రాష్ట్రంలో అంతా చీకటి, విధ్వంసం. ఎప్పుడూ చూడని ఆర్థిక సంక్షోభాన్ని చూశాం. ఎక్కడ చూసినా సమస్యల సుడిగుండమే. రాష్ట్రాన్ని మళ్లీ పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పాం. మళ్లీ బయటపడ్డామంటే కేంద్ర సహకారమే” అని సీఎం చంద్రబాబు తెలిపారు.

# పొత్తులు వర్తించవు.. బలమేంటో చూపుతాం

నాదెండ్ల మీడియాతో మాట్లాడుతూ జనసేన భవిష్యత్ కార్యాచరణను వెల్లడించారు. గత 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రయోజనాల కోసం, ఓట్ల చీలకూడదన్న కారణంతో తాము సీట్ల విషయంలో వెనక్కి తగ్గామని నాదెండ్ల మనోహర్ గుర్తుచేశారు. ఆ నాడు రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వనని ఇచ్చిన మాట కోసం జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కట్టుబడి నిలబడ్డారని, కూటమిని బలోపేతం చేయడం కోసమే జనసైనికులు నాలుగు అడుగులు వెనక్కి వేశారని పేర్కొన్నారు. అయితే, సార్వత్రిక ఎన్నికల నాటి ఆ ఫార్ములా ఇప్పుడు వర్తించదని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కూడా తాము సీట్ల విషయంలో వెనక్కి తగ్గుతామని అనుకుంటే పొరపాటని ఆయన తేల్చి చెప్పారు. ఇప్పటికే దీని గురించి పలు పత్రికలు, ఛానల్స్ లో జనసేన పొత్తులు, భవిష్యత్తుపై వార్తలు ప్రచారం అవుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడి పనిచేసిన జనసైనికులకు, నాయకులకు ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు తగిన ప్రాధాన్యత, అవకాశాలు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కూటమిలోని ఇతర మిత్రపక్షాలతో తగిన సమన్వయం చేసుకుంటూనే, జనసేన శ్రేణులంతా ఎన్నికలకు సంపూర్ణంగా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. నాదెండ్ల మనోహర్ ఇంకా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం జనసేన పార్టీ తగ్గుతుందని పవన్ కళ్యాణ్ అన్నారు. ఆ మాట మేరకు మేం వ్యవహరించాం. కూటమిని బలపరిచేందుకు ఆ రోజు అది సరైన నిర్ణయమని భావించాం. రాబోయే రోజుల్లో ఇదే తీరుగా ఉంటాం. కూటమిలో ఆ పొత్తు కొనసాగుతుందని భావించొద్దు. రాబోయే రోజుల్లో జరిగే ఎన్నికల్లో తాము పట్టు ఉన్న చోట్ల సొంతంగా బరిలోకి దిగి ఫలితాలు రాబట్టాలని భావిస్తున్నాం. ఈ మేరకు పలు జిల్లాల నుంచి స్థానిక నేతల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జనసేన నేతలు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల కోసం నిలబడాలి. యువత, మహిళలు రాజకీయాల్లోకి వచ్చి రాణించాలి. కష్టపడి పనిచేసే వారికి అవకాశాలు తప్పకుండా ఉంటాయి. ఏ మున్సిపాలిటీ, ఏ జిల్లాలో పార్టీ బలంగా ఉందో అక్కడ మనం పోటీ చేస్తామని గుర్తుంచుకోండి. పార్టీని మరింత బలోపేతం చేయడానికి పార్టీ నేతలు మరింత కృషి చేయాలని జనసేన నేతలు, పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు .



## నగర ప్రగతిపై రుడా ప్రత్యేక దృష్టి

**రాజమహేంద్రవరం: జయ జయహే :జూలై 17:**

స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో రుడా 8వ బోర్డు సమావేశం ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అధ్యక్షతన జరిగింది. నగర సమతుల్య అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. బొబ్బిలంక--కడియం బైపాస్ రహదారి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సూచించారు. తూర్పు రైల్వే స్టేషన్ సమీపంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి భూమి కేటాయింపును పరిశీలించాలని ప్రతిపాదించారు. పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని అధికారులను రుడా ఛైర్మన్ ఆదేశించారుఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆదిరెడ్డి శ్రీనివాస్, జేసీ వై. మేఘా స్వరూప్, కుడిపూడి సత్తిబాబు, రుడా అధికారులు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



## అవగాహన కల్పించేలా యువగళం యాంటీ డ్రగ్ థీమ్ పార్క్

### ఆగస్టు నెలాఖరికి పార్కు సిద్ధం చేయాలి

**విశాఖపట్నం (జయ జయహే)**

మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, యువత ను చైతన్యవంతం చేసేలా ప్రపంచంలోనే మొదటిసారిగా విశాఖ సెంట్రల్ పార్క్ ఆవరణలో నిర్మిస్తున్న యువగళం యాంటీ డ్రగ్ థీమ్ పార్క్ అందరికి అవగాహన కల్పించేలా తీర్చిదిద్దాలని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం వి ఎం ఆర్ డి ఎ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ ఎన్ తేజ్ భరత్ తో కలిసి సెంట్రల్ పార్క్ ఆవరణలో నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారిన పడకుండా వారిని సన్మార్గం పయనించేలా యువగళం యాంటీ డ్రగ్ థీమ్ పార్క్ వినోదం ఆహ్లాదంతో పాటు అవగాహన కలిగించేలా ఆకర్షణీయమైన రీతిలో పార్కు ను సిద్ధం చేయాలని సూచించారు. ఈ పార్కు విశాఖనగరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ఉండాలని సూచించారు. ఆకర్షణీయమైన ప్రవేశమార్గం, సంగీతం వచ్చే మెట్లు, ఎల్ ఈ డి దీపాలతో వినూత్నమైన విధంగా పార్కు అన్ని వర్గాల వారి ఆదరణ పొందేలా ఆగస్టు నెలాఖరు నాటికి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ , ఓ ఎస్ డి శ్రీ కృష్ణ నాయక్ , ఈ ఈ రామరాజు , ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## నూతన కార్యవర్గానికి ఫెడరేషన్ అభినందనలు

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూలై 17**

ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగాఅభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రవికుమార్ నాయకత్వంలో ఫెడరేషన్ సభ్యులు స్థానిక ప్రెస్ క్లబ్‌లో నూతన కార్యవర్గాన్ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ, జర్నలిస్టుల మనుగడ, సంక్షేమం, వృత్తి అభివృద్ధికి దోహదపడే సరికొత్త విధానాలను అమలు చేయాలని, అలాగే ఇంకా సభ్యత్వం పొందని జర్నలిస్టులందరికీ ప్రెస్ క్లబ్ సభ్యత్వాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల అభ్యున్నతికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. నూతన అధ్యక్షుడు మోత సారధి, ప్రధాన కార్యదర్శి గోపి మాట్లాడుతూ, త్వరలోనే ప్రెస్ క్లబ్ అభివృద్ధి కోసం సమగ్ర కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని, జర్నలిస్టుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈకార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు వరద నాగేశ్వరరావు, పోతుల వెంకటేష్, విశాలాక్షి, హరి గణేష్, ఆకుల విజయభారతి, సీనియర్ జర్నలిస్టులు లాల్, నజీర్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## టెక్కలి సబ్ ట్రెజరీ కొత్త అధికారిగా నారాయణరావు

**టెక్కలి జూలై 17 జయ జయహే**



టెక్కలి నూతన సబ్ ట్రెజరీ కార్యాలయం అధికారిగా కురమాన నారాయణరావు బాధ్యతలు స్వీకరించారు, శ్రీకాకుళం జిల్లాలోని సోంపేట సబ్ ట్రెజరీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఈయన పదోన్నతపై టెక్కలి వచ్చారు. టెక్కలి సబ్ ట్రెజరీ ఆఫీసులో విధులు నిర్వహించిన కళ్యాణ్ చక్రవర్తి ఏ టి ఓ గా పదోన్నతను పొంది బదిలీపై వెళ్లారు, కొత్తగా బాధ్యతలు తీసుకున్న సబ్ ట్రెజరీ అధికారి నారాయణరావు ను స్థానిక కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతించారు.

# అద్భుత ప్రణాళికతో ద్విచక్ర వాహనాల దొంగలను పట్టుకున్న పోలీసులు

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక కసింకోట పోలీస్ సిబ్బంది చోరీకి గురైన బైకుల ను దొంగలను పట్టుకున్న సంఘటన చోటుచేసుకుంది దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కసింకోట గ్రామానికి చెందిన ఒక వ్యక్తి బైకు చోరీ కి గురైనట్టుగా పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడం జరిగింది అలాగే అనకాపల్లి, అనకాపల్లి రూరల్, విశాఖపట్నం, విజయవాడ ఇలా పలు ప్రాంతాల నుంచి అన్ని పోలీస్ స్టేషన్ కు బైకులు చోరీకి గురైనట్లుగా పోలీసులకు ఫిర్యాదులు అందడంతో ఆ సమాచారం అన్ని స్టేషన్లకు రావడంతో కసింకోట పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని మూడు బృందాలుగా ఏర్పడి ఒకటి జగ్గంపేట మరొకటి కోరుకొండ, గోకవరం మరొక టి రాజమండ్రి ఇలా మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. అయితే రొటీన్ గా కసింకోట హైవేలో వాహనాలు చెకింగ్ చేస్తుండగా ఒక ఐదుగురు యువకులు అటుగా రెండు బైకులపై వెళ్తుండగా వీరి కదలికలపై అనుమానం వచ్చి వారిని ఆపి పోలీసులు సోదా చేయగా ఇవి దొంగలించబడ్డ బైకులుగా గుర్తించడం జరిగింది దీంతో పోలీసులు స్టేషన్కు తీసుకొచ్చి విచారణ చేయగా అసలు విషయాలన్నీ బయటకు రావడం జరిగింది. వీరు దొంగలించబడ్డ బైక్లు,స్కూటర్లు తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం డ్రైవర్ కాలనీలో ఉన్నట్లుగా పోలీసు విచారణలో బైకులు స్కూటర్లు అక్కడ దాచినట్టుగా పోలీసు పట్టుబడ్డ నిందితులు తెలియజేయడం జరిగింది. దీంతో కసింకోట పోలీసులు రాజమండ్రి వెళ్లిన బృందానికి ఇతర ప్రాంతాలు వెళ్లిన బృందాలకి ఈ సమాచారం అందించడంతో పోలీసు బృందాలు ఆ ప్రాంతానికి వెళ్లి 17



ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఇందులో అనకాపల్లి జిల్లాకు సంబంధించిన 14 బైకులు విశాఖపట్నం చెందిన ఒకటి విజయవాడకు చెందిన బైకులు 2, మరి ఇతర ప్రాంతాలకు చెందిన బైకులు స్కూటర్లు పట్టుబడినట్లు డీఎస్పీ జి ఆర్ ఆర్ మోహన్ కసింకోట సీఐ స్వామి నాయుడు మీడియా సమావేశంలో తెలియజేయడం జరిగింది. పట్టుబడిన నిందితులు పాకం శెట్టి సాయికుమార్, మర్రి రవితేజ, మర్రి దుర్గాబాబు ఈ కేసులో ఇద్దరు మైనర్లు కూడా పట్టుబట్టడం జరిగింది వారి పేర్లు తొండ చరణ్ కుమార్ మామిడి శ్యామ్ సుధీర్ ఈ మైనర్ లను వీరందరిని న్యాయస్థానంలో హాజరపరుచగా న్యాయస్థానం వీరిని రిమాండ్ విధించడం జరిగింది ఇందులో ఇద్దరు మైనర్ పిల్లలని జువే సెల్ హోమ్ కు తరలించడం జరిగింది అని పోలీసులు తెలియజేశారు. ఈ చోరీ కాబడ్డ17 ద్విచక్ర వాహనాలు ఖరీదు సుమారు 30 నుంచి 40 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలియజేశారు ఈ కేసును వేగవంతంగా చేదించి భారీ సంఖ్యల చోరీ గురైన ద్విచక్ర వాహనాలను రికవరీ చేయడంలో కసింకోట సీఐ స్వామి నాయుడు ఎస్సైలు కే లక్ష్మణరావు బి సతీష్ పోలీస్ సిబ్బంది హెచ్ సి జి మధుబాబు కానిస్టేబుల్ బి గోపి జి శ్రీనివాసరావు ఎం బాలకృష్ణ ఎం అప్పలరాజు బి మహేష్ రావు వై లక్ష్మణ్ ఎం శ్రీను హెచ్ జి కె బ్రహ్మ రాజు వీరి పని తీరును మెచ్చుకుని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అనకాపల్లి డిఎస్పి ప్రత్యేకంగా వీరిని అభినందించి క్యాష్ రివార్డ్ ఇచ్చి సన్మానించడం జరిగింది.

# నీట్ ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



**పాయకరావుపేట జయ జయహే జులై 17**

నీట్ ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు విశేషమైన ప్రతిభ కనబరచి ఆల్ ఇండియా స్థాయిలో మంచి ర్యాంకులు సాధించారని శ్రీ ప్రకాష్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వివిఎస్ఎస్ భానుమూర్తి శుక్రవారం తెలిపారు. శ్రీ ప్రకాష్ లో ఇస్తున్న నీట్ కోచింగ్ ద్వారా తొలి ప్రయత్నంలోనే ఎనిమిది మంది విద్యార్థులు ఈ ఘనత సాధించారని తెలిపారు. రోజువారీ ప్రణాళిక, అనుభవం గల అధ్యాపకులు నిరంతర పర్యవేక్షణతో ఈ ర్యాంకులు సాధించామన్నారు. తమ విద్యార్థులు వివిధ కేటగిరీల్లో సిహెచ్ ధన వర్ధన్ 955 వ ర్యాంకు, కె దిలీప్ కుమార్ 2430 వ ర్యాంకు, కె ప్రదీప్ కుమార్ 5185 వ ర్యాంకు, స్ప్రిహ 6577 ర్యాంకులు సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అదినేత సిహెచ్ వి కె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందించారు.



# న్యాయం కోసం బాధితుల ఆందోళన

**కొయ్యూరు (జయ జయహే)న్యూస్ జులై 18**

అల్లూరి జిల్లా, కొయ్యూరు మండల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జరుగుతున్న నిరసన నేటికి మూడవ రోజుకు చేరుకుంది. తమకు న్యాయం చేయాలని కాకురు లోవదేవి, కాకురు సుధారాణి చేపట్టిన ఈ శాంతియుత ఆందోళన ఉధృతంగా కొనసాగుతోంది. గత మూడు రోజులుగా ఎండను కూడా లెక్కచేయకుండా బాధితులు నిరసన చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించే వరకు నిరసన విరమించబోమని వారు తేల్చి చెప్పారు. కనికరం లేకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు అని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆందోళన నేపథ్యంలో స్థానిక అధికారులు ఎలా స్పందిస్తారనేది కొయ్యూరులో చర్చనీయాంశంగా మారింది.



## సిసి రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి


**ఏర్పేడు, జులై 17,జయ జయహే.**

శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి మండలం లోని నచ్చనేరి లో శుక్రవారం సీసీ రోడ్డును ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన 'పల్లె పండుగ - 2.0' కార్యక్రమంలో భాగంగా నచ్చ నేరి గ్రామ పంచాయతీ పరిధిలో రూ. 45 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు.ఏర్పేడు - వెంకటగిరి ప్రధాన రహదారి (వైసి రోడ్డు) నుండి నాగంపల్లి గ్రామం వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ నూతన రహదారిని నిర్మించారు . దశాబ్దాలుగా రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడిన నాగంపల్లి గ్రామ ప్రజల కల నేటితో నెరవేరింది. ప్రతి పల్లెకూ అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించి, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అన్నారు.కార్యక్రమం లో కూటమి నేతలు పాల్గొన్నారు.

# కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసిన అనకాపల్లి అచ్యుతాపురం రోడ్డు నిర్మాణ నిర్వాసితులు

**అనకాపల్లి, జయ జయహే**

రోడ్డు విస్తరణలో భూములు, ఇల్లు, షాపులు కోల్పోతున్న నిర్వాసితులకు బాండ్లు రద్దుచేసి హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలు చేసి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని అంటూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి మినిస్ట్రీయల్ సూపర్డెంట్ రాజేశ్వరికి వినతిపత్రం అందజేయడం జరిగింది . ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ శంకర్రావు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ నష్టపోతున్న నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉండాలని కానీ నేటి ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండా టిడిఆర్ బాండ్లు ఇస్తామని చెప్పడం అంటే నిర్వాసితులను మోసం చేయడమేనని గత ప్రభుత్వం గజంకు 18 వేల నుండి 25000 ఇస్తామని అందరు ఆమోదం ఆనాడు తీసుకున్నారని కూటమి ప్రభుత్వం దాన్ని అమలు చేయకుండా టి డి ఆర్ ఇస్తామని కొత్త ఆదేశాలు తీసుకొచ్చి నిర్వాసితులకు అధికారులతొ చెప్పించడం దారుణమని



దీనిపై నిర్వాసితులు కోర్టుకు వెళ్లారని కోర్టు ఆదేశాల గ్రామీణ ప్రాంతంలో టిడిఆర్ బాండ్లు చెల్లవు అని నగదు పరిహారం ఇవ్వాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేటికీ దాని అమలు చేయకుండా నిర్వాసితులను ప్రభుత్వ అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారిని తీవ్ర మానసిక వేదనకు గురి చేస్తున్నారని రోడ్డుకి ఇరువైపులా పంట కాలువలను ధ్వంసం చేసి రోడ్డు కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ నిర్వాసితులను మోసం చేస్తున్నారని వెంటనే అధికారులు తగిన చర్యలు చేసుకొని నష్టపోతున్న నిర్వాసితు లను ఆదుకోవాలని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇచ్చి రోడ్డు వంతెన పనులు పూర్తి చేయాలని రోడ్డు 100 అడుగులు తర్వాత నిర్మాణాలకు ఎటువంటి ఆటంకాలు కల్పించకుండా నష్టపోతున్న నిర్వాసితులకు నిర్మాణాలకు అనుమతుల ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నిర్వాసితుల సంగం కో కన్వీనర్ కె రామ సదాశివరావు అనకాపల్లి అచ్యుతాపురం నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్ రాము రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రీ అప్పారావు, ఎస్ బ్రహ్మాజీ, సిఐటియు నాయకులు కే సోమినాయుడు, కాండ్రేగుల బాబురావు, ఆడారి శివ, ఎస్ కనుమ నాయుడు, వేగి వెంకట అప్పారావు, తనకాల జగ్గారావు అలాగే అనకాపల్లి, మునగపాక, అచ్చుతాపురం మండల నిర్వాసితులు సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున ఈ ధర్నాలో పాల్గొనడం జరిగింది




## చోడవరం పోలీసుల ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం

**చోడవరం జులై 17 జయ జయహే**

మహిళల భద్రతపై అనకాపల్లి జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చోడవరం పోలీసుల ఆధ్వర్యంలో "అభయ" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం మండలం లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలు, బాలికల భద్రత వారికి సంబంధించిన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం ఎస్ఐ బి. నాగకార్తీక్ సుమారు 300 మంది విద్యార్థులకు మానవ అక్రమ రవాణా, యాసిడ్ దాడులు, కిడ్నాప, అపహరణ , పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు , బాల్య వివాహాలు, బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు, డిజిటల్ నేరాలు , గృహ హింస తో పాటు మహిళలపై జరిగే నేరాలు, సైబర్ భద్రత సోషల్ మీడియా వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో 112 ఎమర్జెన్సీ సేవలు , మహిళల సహాయం కోసం 181 మహిళా హెల్ప్‌లైన్ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పన ప్రభుత్వ ధ్యేయం

**చోడవరం జులై 17 జయ జయహే**



ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి, విద్యాలయాలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు చెప్పారు.చోడవరం కోపరేటివ్ కాలనీ లో నూతనంగా నిర్మించిన అంగనవాడి కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే రాజు ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడుతూ చిన్నారుల సౌలభ్యం కోసం ఈ పక్క భవనాలు ఎంతో ఉపయోగపడతాయని, వాటిని సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిల్లలతో ముచ్చటించారు. అనంతరం ప్రాజెక్ట్ డైరెక్టర్ మంగతాయారు, అంగన్వాడి వర్కర్లు, పిల్లల తల్లులు ఎమ్మెల్యే రాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మంగతాయారు, అంగన్వాడి సూపర్వైజర్ శాంతి ప్రియ, పంచాయతీ వార్డు మెంబర్ టి శ్రీనివాస్, పిఎసిఎస్ అధ్యక్షులు గూనురు మోలినాయుడు, హాస్పిటల్ కమిటీ చైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు, హాస్పిటల్ కమిటీ డైరెక్టర్ పప్పు శ్రీను, బాలి బోయిన పార్వతీదేముడు, టిడిపి యువ నాయకులు నౌడు సుధాకర్, పార్థు, విస్సు, బాలికోనత పాఠశాల చైర్మన్ గుమ్మడి సత్య సత్తిబాబు, పనసా రెడ్డి, నేమాలహరి, వీరనాల చినబాబు మాస్టారు, గొర్లె మూర్తి, సిరికి దేవానంద్, ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, అంగన్వాడి టీచర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భక్తుడు పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేసిన సెక్యూరిటీ గార్డ్

**శ్రీకాళహస్తి, జులై 17, జయ జయహే**



శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో భక్తుడు పోగొట్టుకున్న సెల్ ఫోను ను సెక్యూరిటీ తిరిగి అందజేశాడు. సెక్యూరిటీ నిజాయితీ ని భక్తులు ప్రశంసించారు. శుక్రవారం స్వామి అమ్మవారి దర్శనానికి మహరాష్ట్ర నుంచి కారులో వచ్చిన భక్తులు తొందరపాటులో ఐ ఫోన్ ను కార్ బ్యానట్ పై వదిలి వెళ్లిపోవడం జరిగింది. కార్ పై ఉన్న సెల్ ఫోన్ ను సెక్యూరిటీ మించల చంద్రశేఖర్ గుర్తించి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని సెక్యూరిటీ సుపర్ వైజర్ సుబ్బారావు దృష్టికి తెచ్చాడు. భక్తులు వచ్చిన తరువాత వారికి అందజేయమని సుబ్బారావు సూచించారు. దీంతో స్వామి అమ్మవారి దర్శనం ముగించుకోని తిరిగి కార్ వద్దకు వచ్చిన భక్తులకు సెక్యూరిటీ మించల చంద్రశేఖర్ సెల్ ఫోన్ ను భక్తులకు అందించడం జరిగింది. సెక్యూరిటీ సిబ్బంది నిజాయితీని గుర్తించి భక్తులు అనందంతో సెక్యూరిటీ సిబ్బందిని అభినందించి రూ. 500లు పారితోషికం అందించారు.

## ఏపీ షైనింగ్ స్టార్స్ అవార్డుకు భాష్యం విద్యార్థుల ఎంపిక

**చోడవరం, జులై 17, జయ జయహే**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన రాజ--2025 "ఏపీ షైనింగ్ స్టార్స్ అవార్డు" కోసం విడుదల చేసిన అనకాపల్లి జిల్లా మండలాల వారీ మెరిట్ విద్యార్థుల జాబితాలో భాష్యం చోడవరం పాఠశాలకు చెందిన కుంచనపల్లి పూర్ణిమ,పుట్ట వెంకట కౌశిక్ ఎంపికయ్యారు. వీరు తమ కృషి, పట్టుదల, క్రమశిక్షణతో ఈ ప్రతిష్టాత్మక గుర్తింపును సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారని పాఠశాల యాజమాన్యం ప్రశంసించింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థుల విజయం వెనుక ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల నిరంతర శ్రమ కీలక పాత్ర పోషించాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా మరింత మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు హృదయపూర్వకంగా అభినందించారు.

# శ్రీకాళహస్తీశ్వర ఆలయ సమగ్ర అభివృద్ధిపై సమీక్ష

### తిరుమల తరహా సదుపాయాలు, మాస్టర్ ప్లాన్ రోడ్లకు డాలర్స్ దివాకర్, బొజ్జల సుధీర్ రెడ్డి ఆమోదం.



**శ్రీకాళహస్తి, జులై 17,జయ జయహే**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ జ్ఞానప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వర దేవస్థానాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు తుడా ఛైర్మన్, టీటీడీ ఎక్స్ అఫిషియో సభ్యుడు, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా.డాలర్స్ దివాకర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిలు అధికారులతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు.శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం సమావేశపు హాలులో డాలర్స్ దివాకర్ రెడ్డి, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సంయుక్తంగా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.సమావేశంలో భక్తుల వసతులపై ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం శ్రీకాళహస్తిలో ప్రైవేట్ వసతులే ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, భక్తులందరూ దేవస్థాన కాటేజీల్లోనే బస చేసేలా కనీసం 25 నుండి 30 ఎకరాల్లో భారీ కాటేజ్ సముదాయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. తిరుమల తరహాలో సిల్వర్, గోల్డ్, డైమండ్ కేటగిరీల్లో గదులను నిర్మిస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. దీని వల్ల స్థానిక యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి పేర్కొన్నారు.భక్తులకు నేరుగా కనెక్టివిటీ కల్పించేందుకు మాస్టర్ ప్లాన్ రోడ్లను రూపొందిస్తున్నట్లు నేతలు వెల్లడించారు. తొండమానాడు నుండి 40/60 అడుగుల రోడ్డు నిర్మించి, లోబావి వద్ద భారీ వంతెన ద్వారా చెన్నై హైవేకి నేరుగా అనుసంధానం చేయాలని ప్రతిపాదించారు. తిరుచానూరు, వకుళమాత ఆలయాల తరహాలో రోడ్ల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేస్తామన్నారు.తమిళనాడు తిరువణ్ణామలై తరహాలో భక్తులు గిరిప్రదక్షిణ చేసేందుకు అధునాతన రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయాలని డాలర్స్ దివాకర్ రెడ్డి సూచించారు.పుణ్యనది స్వర్ణముఖిలోకి పట్టణ కలుషిత నీరు వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్వర్ణముఖిపై నిర్మించే వంతెనను కింద చెక్ డ్యామ్, పైన రహదారిగా రెండు రకాలుగా ఉపయోగపడేలా ఇరిగేషన్ శాఖ సమన్వయంతో ప్లాన్ చేస్తున్నారు.భక్తుల కోసం నాణ్యమైన, పరిశుభ్రమైన వెజిటేరియన్ హోటల్స్‌ను అందుబాటులోకి తేవాలని సూచించారు. విరాళాలు ఇచ్చే డోనార్లకు ఆలయ ఆర్జిత సేవల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పించేందుకు దేవస్థాన బోర్డుతో చర్చిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.మాస్టర్ ప్లాన్ రోడ్ల కోసం ఆర్డీఓ, ఎమ్మార్వో, రెవెన్యూ, తుడా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి తడ-చెన్నై కనెక్టివిటీని వేగవంతం చేయాలని ఆదేశించారు. భూసేకరణ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, దేవస్థాన ఈవో వెంకటేశ్వర్లు, శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ఛైర్మన్ కొట్టే సాయి, తుడా సెక్రటరీ డా.ఎన్.వి. శ్రీకాంత్ బాబు, సీపీఓ దేవికుమారి, భూసేకరణ అధికారి సుజనతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్, తుడా అధికారులు పాల్గొన్నారు.



## కాణిపాకం ఆలయఅభివృద్ధి పై సిబ్బందితో ఈవో పెంచల కిషోర్ సమీక్ష

**పూతలపట్టు, జూలై 17, జయ జయహే.**

శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి ఆలయం సిబ్బందితో శుక్రవారందేవస్థానం కార్యనిర్వహణాధికారి పెంచలకిశోర్ సమావేశం నిర్వహించారు. దేవస్థానంలో పనిచేయు వివిధ విభాగాల సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఆలయంలో సిబ్బంది భక్తులతో దురుసుగా మాట్లాడకూడదని సూచించారు, క్యూలైన్లు నడుపు సిబ్బంది గణేష అని సంబోధించాలని తెలియజేశారు, శానిటేషన్ పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఏఈఓ, సూపర్డెంట్ సూచించారు, అన్నదానంలో పనిచేయు సిబ్బంది సహనంతో వడ్డించేలా ఆదేశించారు.లడ్డు పోటు నందు సిబ్బందికి లడ్డు నాణ్యత పై పలు సూచనలు జారీచేశారు, వివిధ విభాగాల సిబ్బందితో,అర్చకులు, వేద పండితులతో మాట్లాడి అభిప్రాయాలను తెలుసుకున్నారు, కార్యక్రమంలో డీఈవో సాగర్ బాబు, ఏ ఈ ఓ లు ఎస్వి కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ధనంజయ, మాధవరెడ్డి, ప్రసాద్, సూపర్డెంట్లు వాసు, కోదండపాణి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



## ముద్రగడ పద్మనాభరెడ్డి కాంస్య విగ్రహం

**రాజమహేంద్రవరం: జయ జయహే: జూలై 17**

నీతి, నిజాయితీ, పౌరుషానికి నిలువెత్తు నిదర్శనమైన మాజీ మంత్రి, మాజీ ఎంపి కీర్తిశేషులు ముద్రగడ పద్మనాభరెడ్డి కాంస్య విగ్రహాన్ని రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేయాలని ఆయన అభిమానులు నిర్ణయించారు. శుక్రవారం ఆర్యాపురంలో నిర్వహించిన సంస్మరణ సభలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు యువ న్యాయవాది, ముత్యాల రాయుడు మిత్రమండలి అడ్మిన్ పేడూరి అంబేద్కర్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రోగ్రెసివ్ అడ్వకేట్స్ ఫోరం కన్వీనర్ సుంకర వెంకట భాస్కర రంగారావు అధ్యక్షత వహించారు. ఆంధ్రా లాయర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్, సమైక్యాంధ్ర ఉద్యమ నేత దేశిరెడ్డి బలరామ నాయుడు విశిష్ట అతిథులుగా, రాకా సాంస్కృతిక సంస్థ కోశాధికారి, న్యాయవాది సూరపరెడ్డి తాతారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకులు బద్దిల సత్యనారాయణ, న్యాయవాదులు పడాల జయరాం, నామన సీతారాం, సిరిశెట్టి నాగ శ్రీనివాసరావు, న్యాయవాద గుమస్తా శేషు, సామాజిక సేవకులు అన్నందేవుల సత్యనారాయణమూర్తి (నాని) తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేడూరి అంబేద్కర్ కృతజ్ఞతలు తెలిపారు.



## నిబద్ధతకు నిలువెత్తు ఆదర్శం ముద్రగడ

### పద్మ నాభంకు కాపు సంక్షేమసంఘం కె 9 నివాళులు


**జంగారెడ్డిగూడెం -జయ జయహే**

నీతి నిజాయితీ లకు చిరునామా నిబద్ధతకు నిలువెత్తు ఆదర్శం మాజీ మంత్రి దివంగత కాపు నేత ముద్రగడ పద్మనాభం వంటి నాయకుడు అరుదని ఆయన సేవలు చిరస్మరణీయమని కాపు సంక్షేమసంఘం కె9నాయకులు పేర్కొన్నారు. ముద్రగడ కు మెట్ట ప్రాంత కాపు సంఘం కె 9ఆధ్వర్యంలో సంస్మరణ కార్యక్రమం శీలం కృష్ణం రాజు ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్బంగా పాల్గొన్న వక్తలు పద్మనాభం ముక్కు సూటి విధానం రాజీ పడని మనస్తత్వమ్ గురించి మాట్లాడారు. మొదటి నుంచే ఆయన తనదైన ధోరణి లో రాజకీయం చేస్తూ వచ్చారని ఎక్కడా తప్పు చేయలేని నాయకుడు,ఏమైనా కాపు సామాజిక వర్గం సమర్దత కలిగిన నాయకుడుని కోల్పోయామని విచారం వ్యక్తం జేశారు. పాల్గొన్న నాయకులు ముందుగా ముద్రగడ చిత్ర పటానికి పూల దండ వేసి నాయకులు నివాళులు అర్పించారు.కార్యక్రమం లో కె 9గౌరవ అధ్యక్షుడు దాకారపు కృష్ణ,వ్యవస్థాపకసభ్యులు గౌతు సత్యేంద్ర,రాఘవ రాజు,ట్రెజరర్ గణిత ఆనంద్ ప్రసాద్ మీడియా ఇంచార్జి కె ఎస్ శంకర రావు, మహిళా విభాగం చైర్ పర్సన్ సింగవరపు లక్ష్మి,వాణిజ్య విభాగం ఛైర్మన్ వంకాయల పండు, వ్యవసాయవిభాగం అధ్యక్షులు అప్పనకుమార్,సంఘీక సేవా విభాగం ఆకుల ఏసుబాబు, యువత విభాగం శీలం సతీష్ తెదేపా రూరల్ కమిటీ అధ్యక్షుడు కె మాధవ, తదితరులు పాల్గొన్నారు.

### విశాఖలో ఆధ్యాత్మిక మ్యూజియం కోసం

# స్థలం కేటాయించండి

### సీఎం చంద్రబాబును కోరిన ప్రజాపిత బ్రహ్మకుమారీ రామేశ్వరి



**విశాఖపట్నం, జూలై 17, జయ జయహే :**

అన్ని వర్గాల వారికీ జ్ఞాన విజ్ఞాన వికాసములు కలిగించేందుకు నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములను తమకు కేటాయించాలని విశాఖలోని అన్ని బ్రహ్మకుమారీల సేవా కేంద్రముల తరుపున మీడియా వింగ్ ప్రతినిధి బ్రహ్మకుమారీ రామేశ్వరి కోరారు. ఈ మేరకు మంగళగిరిలోని పార్టీ ఆఫీసులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలసి విజ్ఞప్తి పత్రాన్ని సమర్పించామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము గత రెండున్నర సంవత్సరాలుగా ముఖ్యమంత్రిని కలిసి రెండు దఫాలుగా వినతి పత్రాలను సమర్పించడం జరిగిందని, ఒక ఆధ్యాత్మిక మ్యూజియం భక్తులకు విద్యార్థులకు వ్యాపారస్తులకు అన్ని వర్గాల వారికి జ్ఞాన విజ్ఞాన వికాసములు కలిగించేందుకు తమ సంస్థ కృషి చేస్తోందని వెల్లడించారు. సింహాచలం పరిసర ప్రాంతాలైన అడివివరం, దారపాలెం, భైరవకోన, రిషికొండ, ఎండాడ వంటి ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు గానీ, డిఫారం పట్టా భూముల్లో గాని, ఒక ఎకరం భూమి మా సంస్థకు కేటాయించినట్లయితే సమాజ శ్రేయస్సు కొరకు ముఖ్యంగా యువత, శారీరకంగా దివ్యాంగులైన వారికి మానసిక శక్తిని పెంపొందించేందుకు ఒక ట్రైనింగ్ సెంటర్‌ను నిర్మించనున్నామని తెలిపారు. అందులో ఈ ఆధ్యాత్మిక మ్యూజియం, ప్రాథమిక చికిత్సయం ద్వారా ఆధ్యాత్మిక సామాజిక సేవలను సముచితముగా అందించగలమని బ్రహ్మకుమారీ రామేశ్వరి సీఎం చంద్రబాబుకు వివరించారు.



# క్రమశిక్షణ లేకుంటే పదవులుండవు

### పార్టీ ముఖ్య నేతలతో ఎమ్మెల్యే గంటా

### మెగాజాబ్ మేళా, ఓటర్ల సవరణ విజయవంతం చేశారని అభినందన

**విశాఖపట్నం, జులై 17, జయ జయహే**

భీమిలి మెగా జాబ్ మేళా, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాలను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందించారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ ఆఫీస్ లో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశానికి భీమిలి కంచుకోటని చెబుతూ గత ఎన్నికల్లో 93 వేల రికార్డ్ మెజారిటీ ఇచ్చారని, లక్ష సభ్యత్వాలు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. పేర్కొన్నారు. మెగాజాబ్ మేళాలో వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన 1,200 మంది యువతకు త్వరలో అభినందన సభ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ సంస్థలు, కాలేజీల యాజమాన్యాలతో పాటు కూటమి పార్టీ నేతల విస్తృత ప్రచారం కారణంగా 10 వేల మంది యువత మేళాకు హాజరయ్యారని వెల్లడించారు. అమరావతికి ధీటుగా భీమిలిలో వేల కోట్ల పెట్టుబడులు తీసుకువస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా లేని వారిని, క్రమశిక్షణ పాటించని వారిని పదవుల నుంచి తప్పిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, పార్టీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పుడు, తాట్రాజు అప్పారావు, కోరాడ రమణ, సరగడ అప్పారావు, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, గంటా నూకరాజు, పీవీ నరసింహం, పంచదార్ల శ్రీనివాస్, గరే గుర్నాథ్, కానూరు అచ్యుతరావు, నాగోతి సత్యనారాయణ, లొడగల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# పట్టాదారు పుస్తకాలపై గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు పై విమర్శించిన కొణతాల

**అనకాపల్లి జయ జయహే**

గత ప్రభుత్వంలో వైయస్సార్ పార్టీ నాయకుడు జగన్మోహన్ రెడ్డి రైతు పట్టాదారు పాస్ పుస్తకాలపై, సర్వే రాళ్లపై తీసుకున్న తన సొంత నిర్ణయాల వల్ల రైతులు గోగోలు పట్టే పరిస్థితి ఏర్పడిందని ఈనాటికి కూడా వాటిని చక్కదిద్దలేని పరిస్థితి నెలకొందని ఆయన తీవ్రంగ విమర్శించారు. అనకాపల్లి మండలం ఉగ్గున పాలెం గ్రామంలో నిర్వహించిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం హయంలో భూ రికార్డుల నిర్వహణలో భారీ అవకతవకలు జరిగాయని రాష్ట్రంలో దాదాపు ప్రతి గ్రామంలో భూ రికార్డులను అక్రమంగా మార్చడం వల్ల ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కూడా భూ వివాదాలు ప్రతిచోట తలెత్తేయని ఆయన అన్నారు ఒకరి పేరుపై ఉన్న భూమిని మరొకరి పేరుకు మార్చడం భూ విస్తీర్ణాన్ని తగ్గించి నమోదు చేయడం సర్వే నంబర్లు తప్పులు



వేయడం అసలు భూమిలేదని చూపించడం వంటి అక్రమాలు చోటు చేసుకున్నాయని, అలాగే సర్వే రాళ్లపై పట్టాదారు పాస్ పుస్తకాలపై రైతులు ఫోటోలు ఉండాలి గాని తన బొమ్మను వేసుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన పనికి రైతులకు, ప్రజలకు అయోమయాన్ని ఆందోళనకు గురి చేసిందని అలాగే ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన రోడ్డు ప్రమాదం ప్రస్తావిస్తూ ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించడం ప్రతి ఒక్కరు బాధ్యత అని ప్రమాదానికి కారణమైన వ్యక్తిని తప్పించి వేరొకరిని ఇరికించడం చిన్నపిల్లవాడి పై నేరం మోపడం యాక్సిడెంట్లు సహజం అంటూ ఆయన సమర్థించడం చేస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు గతంలో కోడి కత్తి సంఘటన కూడా అమాయకుడైన యువకుడని ఐదేళ్లపాటు జైల్లో ఉంచారని మరి ఆనాడు గుర్తుకు రాలేదా అతను చిన్న పిల్లవాడిని అయినా కోడి కత్తి శీను ను వదిలిపెట్టలేదని ఆయన ఘాటుగా విమర్శించారు ప్రజల రక్షించాల్సిన నాయకుడే ప్రజలను బక్షించే పరిస్థితి చేశారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా తన తీరు పద్ధతి మార్చుకోవాలని లేని పక్షంలో ప్రజలు తగిన బుద్ధి చెప్పే పరిస్థితి మళ్లీ ఏర్పడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కూటమి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది

# వాతావరణ మార్పులను తట్టుకునే అభివృద్ధి అవసరం

**ప్రకృతి విపత్తు సవాళ్లకు అంతరిక్ష సాంకేతికతే సమాధానం**

**ఉపగ్రహ డేటాతో ముందస్తు హెచ్చరికలు**

**శాస్త్రీయ ప్రణాళికలతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించవచ్చు**

**ఎన్.ఆర్.ఎస్.సి డైరెక్టర్ డా. ప్రకాశ్ చౌహాన్**



**విశాఖపట్నం, జూలై 17, జయ జయహే :**

ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న ప్రకృతి వైపరీత్యాలు, అభివృద్ధి ప్రాజెక్టులపై వాటి ప్రభావం వంటి అంశాలు నేడు ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తల ముందున్న అతిపెద్ద సవాళ్లుగా నిలుస్తున్నాయని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎనఆరఎస్సి) డైరెక్టర్ డా. ప్రకాశ్ చౌహాన్ పేర్కొన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి అంతరిక్ష సాంకేతికతను ఉపయుక్తంగా నిలుపుకుంటూ విభిన్న వ్యవస్థలు సమన్వయంతో పనిచేయడం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం నిర్వహించిన వేప కృష్ణమూర్తి ఎండోమెంట్ లెక్చర్‌లో భాగంగా ఆయన స్పేస్ టెక్నాలజీ ఆఫ్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ ఇన్ చేంజింగ్ క్లైమేట్( వాతావరణ మార్పులు -- ప్రకృతి విపత్తులు -- అంతరిక్ష సాంకేతికత పాత్ర ) అనే అంశంపై ఆయన ప్రసంగించారు. గత 25 ఏళ్లుగా దేశవ్యాప్తంగా వరదలు, కొండచరియలు విరిగి పడటం, భూకంపాలు, తుఫాన్లు, పిడుగులు, వాతావరణ మార్పులకు సంబంధించిన లక్షలాది ఉపగ్రహ చిత్రాలను విశ్లేషిస్తూ ఎనఆరఎస్సి దేశానికి ఒక సమగ్ర శాస్త్రీయ డేటాబేస్‌ను రూపొందించిందని తెలిపారు. డా. ప్రకాశ్ చౌహాన్ ప్రసంగంలో భాగంగా వాతావరణ మార్పులు భారత అభివృద్ధిపై చూపుతున్న ప్రభావాన్ని శాస్త్రీయ ఆధారాలతో విశ్లేషిస్తూ, భవిష్యత్ భారత నిర్మాణంలో అంతరిక్ష సాంకేతికత ఎంత కీలక పాత్ర పోషించబోతోందో వివరించారు. వాతావరణ మార్పుల మూలకారణాలను వివరిస్తూ, కార్బన్ డయాక్సైడ్, మీథేన్ వంటి గ్రీన్‌హౌస్ వాయువులు భూమి నుంచి వెలువడే ఉష్ణాన్ని తిరిగి భూమిపైనే నిలిపివేస్తున్నాయని చెప్పారు. ఫలితంగా భూమి సగటు ఉష్ణోగ్రతలు నిరంతరం పెరుగుతున్నాయని, ముఖ్యంగా రాత్రి ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయని గత వందేళ్ల పరిశోధనలు నిర్ధారించాయని తెలిపారు. మీథేన్ వాయువు కార్బన్ డయాక్సైడ్ కంటే అనేక రెట్లు అధిక గ్లోబల్ వార్మింగ్ ప్రభావాన్ని కలిగిస్తుందని వివరించారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ విపత్తులను ముందస్తుగా గుర్తించడం, నియంత్రణకు సాంకేతికత ఉపకరిస్తున్న విధానాన్ని వివరించిన విధానాన్ని అభినందించారు. శాస్త్ర,సాంకేతికత మానవాళికి ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని కళ్లకు కట్టినట్లుగా ఈ ప్రసంగం నిలచిందన్నారు. అనంతరం విశ్వవిద్యాలయం తరపున డాక్టర్ ప్రకాష్ చౌహాన్‌ను సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.



## రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు విశాఖలోనే ఉండాలి. భీశెట్టి బాబ్జి

**అమరావతి కి తరలించాలనే నిర్ణయం ఆపండి**

**విశాఖపట్నం (జయ జయహే)**

విశాఖపట్నం కేంద్రంగా పరిపాలన చేస్తున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో ఉండే రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు (ఆర్ ఆర్ బీ )ని విశాఖపట్నం కేంద్రం గా ఉంచాలే తప్ప అమరావతి లో ఏర్పాటు చెయ్యాలనే ఆలోచనముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి రావడం సరికాదని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు శుక్రవారం లోక్ సత్తా కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కి రాసిన లేఖను విడుదల చేశారు ఈ సందర్బంగా భీశెట్టి మాట్లాడుతూ రైల్వే రిక్రూట్మెంట్ బోర్డుని అమరావతి లో ఏర్పాటు చెయ్యాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం ఆచ్చర్యం కలిగించిందని రిక్రూట్ మెంట్ బోర్డు లేకపోతే రైల్వే జోన్ విశాఖలో ఉండి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు,విశాఖలో ఆర్ ఆర్ బీ ఏర్పాటు జరిగితే ఉత్తరాంధ్ర ప్రజలకు అనేక ప్రయోజనాలు ఉంటాయని రైల్వే జోన్ ఎక్కడ ఉంటే బోర్డు కూడా అక్కడే ఉంటుందని ఇప్పటికే రాష్ట్ర లోక్ సత్తా నుండి కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్ కి ఆర్ ఆర్ బీ నీ విశాఖపట్నం లోనే పెట్టాలని లేఖ రాశామని, చంద్రబాబు నాయుడు తన నిర్ణయం వెనక్కి తీసుకోక పోతే ఉత్తరాంధ్ర లోని ప్రజలకు తెలుగుదేశం పార్టీ దూరమవుతుందని భీశెట్టి అన్నారు, యువత ఆందోళన చంద్రబాబు అర్థం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలని అయన కోరారు ఎమ్మెల్యేలు మంత్రులు, ఎంపీలు చంద్రబాబు తో మాట్లాడాలని కోరారు ఈ సమావేశంలో జిల్లా నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, కార్పొరేషన్ కార్యదర్శి పి.ఎల్.ఎన్. రాజు,సహాయ కార్యదర్శి బోర రమేష్, పౌర వేదిక జిల్లా ఉపాధ్యక్షులు పిడకల ప్రభాకరరావు, కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

# పుష్కర్ణిలో శివపార్వతుల విగ్రహాల ఏర్పాటుకు ఐదు లక్షలు విరాళం




**చోడవరం జులై 17 జయ జయహే**

చోడవరం స్వయంభూ శ్రీ గౌరీశ్వర స్వామి సన్నిధిలో జరుగుతున్న ఆలయ పుష్కరిణి అభివృద్ధి నిమిత్తం గునూరు మల్లునాయుడు శ్రీదేవి దంపతులు పుష్కరిణి మధ్యలో శివపార్వతుల విగ్రహం ద్వాదశ జ్యోతిర్లింగాలు నిమిత్తం 500000 ఐదు లక్షలు రూపాయలు విరాళం ప్రకటించారు. దానిలో భాగంగా శుక్రవారం శాసనసభ్యులు కే ఎస్ ఎన్ రాజు చేతుల మీదుగా ఒక లక్ష రూపాయల అందించారు. పుష్కరిణి పూర్తి అయ్యే లోపు 5 లక్షలు విరాళం ఇవ్వడానికి అంగీకరించారు. వారిని ఎమ్మెల్యే అభినందించారు.

## బుజ్జి ఆవులతో బొజ్జల కాలక్షేపం

**శ్రీకాళహస్తి, జులై 17,జయ జయహే**



.ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఇంట రెండు బుజ్జి అవులున్నాయి.చూడముచ్చటగా ఉన్న ఈ బుజ్జి ఆవులంటే ఎమ్మెల్యే కి చాలా ఇష్టం. సమయం దొరికినప్పుడల్లా ఈ బుజ్జి ఆవులతో గడపడం ఆయనకి మహా ఇష్టం.వాటికి ఆయనే స్వయంగా మేత వేయడం, నీళ్లు పెట్టడం చేస్తుంటారు.పురాతన సంస్కృతిలో గోమాతకు ఎంతో విశిష్టమైన స్థానం ఉండగా తనకి మొదటి నుండి ఆవులన్నా, ముఖ్యంగా ఈ బుజ్జి ఆవులన్నా ఎంతో ఇష్టమని చెబుతుంటారు. అందుకే తన నివాసంలో ప్రపంచంలోనే అత్యంత చిన్న జాతికి చెందిన "నాడీపతి నానో ఆవులని " ఎంతో ముద్దుగా పెంచుకుంటున్నారు. ఉదయాన్నే ఈ చిన్నారి గోమాతలతో కాసేపు సమయం గడపడం, దాన్ని ప్రేమగా నిమరడం మనసుకు ఎంతో ప్రశాంతతను ఇస్తుందని అంటారు.

# విద్యార్థినుల రక్షణ కోసం "అభయ" కార్యక్రమం

**పాయకరావుపేట జయ జయహే జులై 17**

విద్యార్థినుల భద్రత, మహిళలపై జరుగుతున్న వేధింపుల నివారణపై శుక్రవారం శ్రీ ప్రకాష్ కళాశాలలో జరిగిన "అభయ" అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వినోద్ బాబు మాట్లాడుతూ... ఆపదలో ఉన్నప్పుడు అమ్మాయిలు భయపడకుండా పోలీసుల సహాయం పొందాలని, దిశ యాప్ వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. విద్యార్థినులు ధైర్యంగా ఉంటేనే సమాజంలో చైతన్యం వస్తుందని, అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. మహిళల రక్షణ కోసం పోలీస్ వ్యవస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈవిటీజింగ్ పట్ల ఎలా వ్యవహరించాలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో మహిళా సంబంధిత సమస్యలు, అత్యవసర సహాయం కోసం 112, ఉమెన్ హెల్ప్ లైన్ కోసం 181, వాట్సాఫ్ ద్వారా సహాయం కోసం 7993485111, చైల్డ్ హెల్ప్ లైన్ కోసం 1098, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ కోసం 1930 నంబర్లకు ఫోన్ చేయాలని సిఐ వినోద్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.





## పెద్ద రెడ్డిని కలిసిన పూతలపట్టు నూతన వైసిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి

**పూతలపట్టు జూలై 17, జయ జయహే**

మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్ద రెడ్డి రామచంద్రారెడ్డిని పూతలపట్టు మండలం వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి శుక్రవారం ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూతలపట్టు మండల కన్వీనర్ గా నియమితులైన సుధాకర్ రెడ్డి పూతలపట్టు మండలంలో వై ఎస్ ఆర్ సీపీ పార్టీని, శ్రేణులను మరింత బలపరుస్తామని పెద్ద రెడ్డి రామచంద్ర రెడ్డికి తెలియ జేశారు . వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డిని కూడా అయన మర్యాదపూర్వకంగా కలిశారు.ఆయనతోపాటు పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డా సునీల్ కుమార్, రాష్ట్ర మేధావుల సంఘం వేదిక కార్యదర్శి పూతలపట్టు జగదీశ్వర్ రెడ్డి, పూతలపట్టు మండలం పోలవరం పంచాయతీ మాజీ సర్పంచ్ నిరంజన్ రెడ్డి , కార్యక్రమం లో పాల్గొన్నారు.

# దక్షిణ నియోజకవర్గంలో గ్రీవెన్స్

**64 అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ .... సమస్యలను పరిష్కరిస్తామన్న జేసీ విద్యాధరి**

**విశాఖపట్నం, జూలై 17, జయ జయహే :**

దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో "వన్ మంత్--వన్ కాన్స్టెన్సీ--ఫోర్ విజిట్స" కార్యక్రమం సూర్యబాగ్ సౌత్ జోనల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారుల సమక్షంలో నియోజకవర్గ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను ఎమ్మెల్యే వంశీకృష్ణ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నాలుగు వారాల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీల్లో ప్రధానంగా పెన్షన్లు, గృహాల కోసం దరఖాస్తులు ఉన్నాయని చెప్పారు. అందిన ప్రతి సమస్యను పరిష్కరించేలా కార్యాచరణ సిద్ధం చేశామని పేర్కొన్నారు.



నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి దాదాపు పూర్తయిందన్నారు. హౌసింగ్ దరఖాస్తులను పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ జి. విద్యాదరి మాట్లాడుతూ రెవెన్యూ గ్రీవెన్స్‌లో దక్షిణ నియోజకవర్గానికి సంబంధించిన 64 దరఖాస్తులు అందాయని తెలిపారు. ప్రజలు సమర్పించిన ఫిర్యాదులు, వినతులపై వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. రాబోయే మూడు శుక్రవారాలు కూడా ఇదే విధంగా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. ఒకే సమస్యపై ప్రజలు పదేపదే కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా శాశ్వత పరిష్కారం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ దిలీప్ చక్రవర్తి, ఎమ్మార్వో లచ్చుపాత్రుడు, జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్య నాయుడు, రెవెన్యూ శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com